విలేకరులు కావలెను
తెలంగాణ వాణి
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా విలేకర్లు కావలెను.
పొలిటికల్, ప్రజాసమస్యలు, అక్రమాలపై వార్త రాసే పట్టు కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును
9703247143

TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127
# తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక

తెలంగాణ వాణి TV
THE VOICE OF TELANGANA
ఎడిటర్ జెరిపోతుల సంపత్
9912758107

సంపుటి: 16 | సంచిక : 125 | శుక్రవారం 04. 9. 2026 | ఎడిటర్: జెరిపోతుల సంపత్ | కరీంనగర్ | పేజీలు 8 | వెల: 5.00




# తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త రికార్డు!

- తెలంగాణ రాజకీయాల్లో గత కొద్దిరోజులుగా తీవ్ర దుమారం
- వివాదాస్పద పరిణామాల నేపథ్యంలో కొండా సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన నిర్ణయం
- సురేఖను మంత్రి వర్గం నుంచి తక్షణమే తొలగించాలని కోరుతూ లేఖ లోక్ భవన్‌కు లేఖ
- ఈ ప్రతిపాదనపై గవర్నర్ అధికారిక నిర్ణయం తీసుకోవడమే తరువాయిగా మిగిలింది.
- ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై కాంగ్రెస్ అధిష్ఠానం వేటు

## హైకమాండ్‌ను సీఎం రేవంత్ బ్లాక్‌మెయిల్ చేశారు



- మంత్రి కొండా సురేఖ తీవ్ర ఆరోపణలు
- "నా వివరణ తీసుకోకుండా బర్తరఫ్ నిర్ణయం తీసుకున్నారు.
- ఉరిశిక్ష పడిన ముద్దాయిని కూడా చివరి కోరిక ఏంటని అడుగుతారు.
- ఏ తప్పు చేయకపోయినా.. ఎందుకు చేస్తున్నామో చెప్పకుండా నన్ను బర్తరఫ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా. మంత్రి పదవి నుంచి నన్ను తొలగించే ఉద్దేశం కాంగ్రెస్ హైకమాండ్‌కు లేదు.
- ఆ విషయం నాకు వంద శాతం తెలుసు. కానీ.. సీఎం రేవంత్‌రెడ్డి హైకమాండ్‌ను బ్లాక్‌మెయిల్ చేశారు.
- ఆమెను మంత్రి పదవి నుంచి తొలగిస్తారా? నన్ను రాజీనామా చేయమంటారా? అని సీఎం బెదిరించారు.

## మంత్రి కొండా సురేఖను బర్తరఫ్ చేయండి..

- సీఎం రేవంత్‌రెడ్డి గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లాకు లేఖ
- ఆమెను తక్షణమే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని విజ్ఞప్తి
- రాజీనామాకు కొండా సురేఖ ససేమిరా అనడంతో ఆమెను తొలగించాలి
- చిన్నారెడ్డి స్థానంలో గద్వాల్ విజయలక్ష్మి



హైదరాబాద్:(తెలంగాణ వాణి)
తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. మంత్రి కొండా సురేఖ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై కాంగ్రెస్ అధిష్ఠానం వేటు వేసింది. ఈ మేరకు హైకమాండ్ నిర్ణయం తీసుకుంది.క్యాబినెట్ నుంచి సురేఖను తొలగించేందుకు అధిష్ఠానం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో సీఎం రేవంత్‌రెడ్డి వర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లాకు లేఖ పంపారు. ఆమెను తక్షణమే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని సీఎం కోరారు. రాజీనామాకు కొండా సురేఖ ససేమిరా అనడంతో ఆమెను తొలగించాలని సీఎం సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది. సీఎం లేఖపై గవర్నర్ త్వరలో నిర్ణయం తీసుకోనున్నారు మరోవైపు ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా ఉన్న చిన్నారెడ్డి స్థానంలో జీహెచ్‌ఎంసీ మాజీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని సీఎం రేవంత్ నియమించారు. రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారద, కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్‌పర్సన్‌గా జి.సుధారాణి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల పరకాల నియోజకవర్గం గీసుకొండలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని కించపరిచేలా ఆమె వ్యాఖ్యలు చేశారు. దీనిపై వివరణ ఇవ్వాలంటూ కొండా సురేఖకు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ (డీఏసీ) షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఆమె తన వివరణ పంపారు. కుమార్తె వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమని.. వాటితో తనకు సంబంధం లేదని పేర్కొన్నారు. ఆమె చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయొద్దని కోరారు. మరోవైపు వనపర్తి వ్యవహారంలో ఎమ్మెల్యే మేఘారెడ్డిపై మాజీ మంత్రి చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలు కూడా చర్చనీయాంశమయ్యాయి. వివరణ ఇవ్వాలని ఆయనకూ డీఏసీ షోకాజ్ నోటీసు జారీ చేసింది.



## అసెంబ్లీలో మీ ఇష్యూ గురించే మాట్లాడతా..

రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పాలిటెక్నిక్ విద్యార్థుల తరపున పోరాటం చేస్తామని మాజీ మంత్రి కేటీఆర్ విద్యార్థులకు భరోసా ఇచ్చారు. కేటీఆర్ నల్గొండ పర్యటనలో ఆయన వద్దకు పాలిటెక్నిక్ విద్యార్థులు వచ్చి జీవో 97 కారణంగా ఎదుర్కొంటున్న సమస్యల గురించి చెప్పారు. ఈ సందర్భంగా ఆయన వారితో మాట్లాడుతూ.. ఈ నెల 7వ తేదీ నుండి అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయని మీ సమస్యనే ప్రధానంగా తీసుకుంటామని అన్నారు. వాళ్లు పాలిటెక్నిక్ కాలేజీల భూములు ఎత్తుకుపోయేందుకే ఈ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు.

## అంతు చిక్కని ప్రకృతి విలయం

- 1127కి చేరిన వరద మృతుల సంఖ్య
- 4858 మంది కోసం ఇంకా గాలింపు
- డీఎన్‌ఏ టెస్టుల ద్వారా శవాల గుర్తింపు

02



## ముగ్గురు బీసీ మహిళలకు కీలక పదవులు

హైదరాబాద్:(తెలంగాణ వాణి)
మంత్రివర్గం నుంచి తనను తొలగించడంపై కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలకు కాంగ్రెస్ ప్రభుత్వం పక్కా వ్యూహంతో సమాధానమిచ్చింది. "నేను బీసీ మంత్రిని కాబట్టే నాపై కుట్ర చేసి పదవి నుంచి తప్పించారు" అంటూ కొండా సురేఖ సెంటిమెంట్ కార్డు వాడగా.. దానికి కాంగ్రెస్ మార్క్ రాజకీయ కౌంటర్ ఇచ్చింది. ఒక బీసీ నేతను పదవి నుంచి తప్పిస్తూనే, అదే సమయంలో ముగ్గురు బీసీ వర్గానికి చెందిన మహిళా నేతలకు ఉన్నత పదవులు కట్టబెట్టింది. కొండా సురేఖ ఆరోపణలను తిప్పికొట్టేలా ప్రభుత్వం చేపట్టిన కీలక నియామకాలు చేపట్టింది. మున్నూరు కాపు అయిన గద్వాల విజయలక్ష్మిని తెలంగాణ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షురాలిగా, గౌడ్ సామాజికవర్గానికి చెందిన నేరెళ్ల శారదను తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్‌గా, పద్మశాలి సామాజికవర్గానికి చెందిన గుండు సుధారాణిని కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ( చైర్ పర్సన్‌గా నియమించింది.బీసీ వర్గానికి చెందిన సురేఖ వ్యాఖ్యలతో పార్టీకి ఎలాంటి నష్టం వాటిల్లకుండా కాంగ్రెస్ అధిష్ఠానం ముందస్తు జాగ్రత్తలు తీసుకుంది. బీసీ సామాజిక వర్గానికి చెందిన బలమైన ఉప కులాలకు (మున్నూరు కాపు, గౌడ్, పద్మశాలి) ప్రాతినిధ్యం కల్పిస్తూ మహిళా నేతలను అగ్రపీఠాన కూర్చోబెట్టింది.





## సూర్యాపేట టౌన్ ప్లానింగ్ అధికారి నివాసంలో ఏసీబీ సోదాలు

సూర్యాపేట: సూర్యాపేట టౌన్‌ప్లానింగ్ అధికారి సోమయ్య నివాసంలో ఇవాళ ఉదయం నుంచి ఏసీబీ సోదాలు కొనసాగుతున్నాయి. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలు, ఫిర్యాదుల నేపథ్యంలో ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సూర్యాపేట మానసానగర్, హైదరాబాద్ హయత్‌నగర్‌లోని సోమయ్య నివాసాలతో పాటు సూర్యాపేట మున్సిపల్ కార్యాలయంలోని రికార్డులను కూడా తనిఖీ చేస్తున్నారు.

# వరుస దాడులతో అక్రమ స్మగ్లింగ్ మిల్లుల యజమాన్యాలపై ఉక్కుపాదం

### రంగంలోకి దిగిన విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్, ఏసీబీ అధికారులు..

### అధికారుల దాడులు అరెస్టుల నుండీ తప్పించుకుని తిరుగుతున్న పదుల సంఖ్యలో రైస్ మిల్లుల యజమానులు

హైదరాబాద్ సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి స్పెషల్ కరస్పాండెంట్ టి.ఎన్ రమేష్)

తెలంగాణ కస్టమ్ మిల్డ్ రైస్(సీఎంఆర్) ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్) వరి ధాన్యాన్ని, ప్రాసెసింగ్ చేసిన బియ్యాన్ని, కొందరు రైస్ మిల్లర్లు అక్రమంగా స్మగ్లింగ్ చేసి రాష్ట్ర సరిహద్దులు దాటిన విషయంపై, రాష్ట్ర స్థాయిలో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ (వీ అండ్ ఈ) శాఖ అధికారులతో పాటు ఏసీబీ అధికారులు, ఎన్ఫోర్స్మెంట్ అధికారులు విస్తృతంగా దాడులు చేస్తూ అక్రమార్కుల గుట్టురట్టు చేస్తున్నారు. అక్రమ స్మగ్లర్ల మిల్లులపై అధికారులు దాడులు చేయగా, స్మగ్లర్లు ప్రభుత్వం నుండి పొందిన వరి ధాన్యం, ప్రాసెసింగ్ చేయబడిన బియ్యం మాయం చేసిన ఘటనలో, అధికారులకు విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. దీంతో అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా అక్రమాలకు పాల్పడిన రైస్ మిల్లుల యజమానులపై కొరడా ఝుళిపిస్తున్నారు. లక్షలాది రూపాయల డబ్బు ఇతర వ్యాపారాలలో ఇన్వెస్ట్మెంట్ చేసి, ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టారని అధికారులు తేల్చారు. ప్రైవేటు రవాణా మరియు నిల్వ వ్యాపారుల యొక్క విస్తారమైన నెట్వర్క్ చైన్ సిస్టంతో, బ్లాక్ మార్కెట్కు వరి ధాన్యం, ప్రాసెసింగ్ చేసిన బియ్యాన్ని వివిధ బ్రాండ్ల పేర్లతో, రాష్ట్ర సరిహద్దులు దాటించి, స్మగ్లింగ్కు పాల్పడ్డారని, విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ మరియు ఎసిబి అధికారులు తనిఖీలలో గుర్తించారు. పోలీసు ఎఫ్ఐఆర్ లలో స్థానిక మిల్లుల నిర్దిష్ట వ్యక్తిగత పేర్లు బయట పెట్టలేదు. కానీ ఏసీబీ అధికారుల విశ్లేషణ తో జిల్లాలలో అక్రమార్కుల చిట్టా బయటపడింది.



2021-22 ఖరీఫ్ సీజన్లో ఒక్క కామారెడ్డి జిల్లాలోని 39 మంది రైస్ మిల్లర్లు ప్రాసెసింగ్ బియ్యాన్ని స్మగ్లింగ్ చేసి దారి మళ్ళించడంతో 581 మెట్రిక్ టన్నుల కొరత ఏర్పడింది. 2022-23 ఖరీఫ్ సీజన్లో 37 మిల్లుల యజమానులు పిడిఎఫ్ బియ్యం ఇవ్వలేక ఖాళీ గోదాములతో యజమానులు చేతులెత్తేయడంతో, 19.529 మెట్రిక్ టన్నుల బియ్యం ప్రభుత్వా ఖజానాకు భారీ స్థాయిలో గండి కొట్టింది. అవినీతి నిరోధక బ్యూరో (ఏసీబీ) విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ (వీ అండ్ ఈ) శాఖల అధికారులు, నిర్వహించిన ఉన్నత స్థాయి దర్యాప్తులో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా భారీ కుంభకోణం వెలుగు చూసింది. నిజామాబాద్ కామారెడ్డి జిల్లాలలో మిల్లుల నుండి 90,000 వేల మెట్రిక్ టన్నుల బియ్యం నిల్వలు మాయమయ్యాయి. కామారెడ్డి సమీకృత కలెక్టరేట్ సముదాయంలో, ఏసీబీ అధికారులు ఆకస్మిక దాడులు చేయగా, 44.14 కోట్ల రూపాయల ప్రజా పంపిణీ బియ్యం స్మగ్లింగ్ జరిగినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. భౌతిక నిల్వాలను డిజిటల్ రికార్డులలో పోల్చి ఎడిట్ చేసేందుకు కామారెడ్డి శివారు పరిధిలో పాల్వంచ ఆరేపల్లి గ్రామాల పరిసరాల లోని, రైస్ మిల్లులు గిడ్డంగులను, అధికారులు టార్గెట్ చేసి, ఏసీబీ, విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్, టాస్క్ ఫోర్స్ డిపార్ట్మెంట్ల కు చెందిన బహుళ సంస్థల అధికారులు దాడులు నిర్వహించారు. అధికారుల దాడులతో, అక్రమంగా రేషన్ బియ్యం రీసైక్లింగ్ చేయడం తోపాటుగా, వరి ధాన్యాన్ని సైతం దారి మళ్లించడం ద్వారా పలు జిల్లాలలో వేలాది కోట్ల రూపాయల మేర ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్) కస్టమ్ మిల్డ్ రైస్ (సీఎంఆర్) అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో పదుల సంఖ్యలో కొందరు మిల్లుల యజమానులు పరారీలో ఉన్నట్లు సమాచారం. ప్రభావిత ప్రాంతాలైన సూర్యపేట, నల్లగొండ, మెదక్, కరీంనగర్, కామారెడ్డి, వరంగల్, ఆదిలాబాద్, పెద్దపల్లి, నాగర్ కర్నూల్, నిర్మల్, నిజామాబాద్, సిద్దిపేట, రంగారెడ్డి, నారాయణపేట జిల్లాలలో అధికారులు దాడులు నిర్వహించి, కొన్ని మిల్లులను సీజ్ చేయడం జరిగింది. మరికొందరిపై కేసులు నమోదు చేయడం జరిగింది. కొంతమంది అక్రమార్కులను అరెస్టు చేయడం కూడా జరిగింది అని అధికారికంగా తెలిసింది. దీంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మిల్లుల యజమానులకు కేటాయించిన వరి ధాన్యానికి, క్వింటాలుకు 2,236.81 రూపాయల చొప్పున వసూలు రేటును నిర్ధారించి జీవో ఎంఎస్ 7 జారీ చేసింది. రేపటి సంచికలో, మరికొన్ని జిల్లాల పేర్లు, స్మగ్లింగ్ కు పాల్పడ్డ మిల్లుల పేర్లు, బకాయిలు, రెవెన్యూ రికవరీ చట్టాన్ని ఉపయోగించి, అక్రమార్కుల నుండి అధికారులు భౌతిక ఆస్తులు జప్తు చేస్తున్న కథనంతో మళ్లీ కలుద్దాం!

## ఆర్టీసీ నైట్ సర్వీసులు ప్రారంభం




హైదరాబాద్, అక్షిత ప్రతినిధి: హైదరాబాద్ జంటనగరాల పరిధిలో నైట్ టైమ్ రవాణా సౌకర్యం కోసం ఇబ్బందులు పడుతున్న వారికి తెలంగాణ స్టేట్ రోడ్డు రవాణా సంస్థ శుభవార్త చెప్పింది. నైట్ డ్యూటీలు చేసే ప్రైవేట్ ఎంప్లాయిస్, ఐటీ కంపెనీల్లో నైట్ షిఫ్ట్‌లకు వెళ్లే టెక్కీలు, సివిల్ వర్క్స్ చేసుకునే వేలాది మంది ఇకపై ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టుతో కష్టాలు,డబ్బులు ఖర్చు చేసుకునే బాధను మిగతా 2లో..

# జనాభా పెరుగుదలతో నష్టం ఎవరికి?



పెరుగుతున్న జనాభా తగ్గుతున్న వనరులు భవిష్యత్ తరాలకు సవాల్‌గా మారుతున్న జనాభా విస్ఫోటనం ప్రపంచవ్యాప్తంగా జనాభా నిరంతరం పెరుగుతోంది. జనాభా పెరుగుదల ఒకవైపు దేశ ఆర్థికాభివృద్ధికి మానవ వనరులను అందిస్తే, మరోవైపు వనరులపై తీవ్రమైన ఒత్తిడిని సృష్టిస్తోంది. జనాభా పెరుగుదలతో ఆహారం, నీరు, నివాసం, విద్య, వైద్యం, ఉపాధి వంటి ప్రాథమిక అవసరాలపై డిమాండ్ పెరుగుతోంది. ఈ అవసరాలకు అనుగుణంగా వనరులు పెరగకపోతే దాని ప్రభావాన్ని మొదటగా ఎదుర్కొనేది సామాన్య ప్రజలే.

జనాభా పెరుగుదలతో భూమిపై ఒత్తిడి పెరుగుతోంది. వ్యవసాయ భూములు క్రమంగా నివాస ప్రాంతాలుగా, పరిశ్రమలుగా మారుతున్నాయి. ఫలితంగా సాగుభూమి తగ్గి, ఆహార ఉత్పత్తిపై ప్రభావం పడుతోంది. మరోవైపు జనాభా పెరుగుతున్న కొద్దీ నీటి వినియోగం కూడా పెరుగుతోంది. భూగర్భ జలాల అధిక వినియోగం, వర్షపాతం లోపాలు, వాతావరణ మార్పులు కలిసి భవిష్యత్తులో నీటి కొరతను మరింత తీవ్రతరం చేసే ప్రమాదం ఉంది. ఉపాధి అవకాశాలపై కూడా జనాభా పెరుగుదల తీవ్ర ప్రభావం చూపుతుంది. ప్రతి ఏడాది ఉద్యోగాల కోసం పోటీ పడే యువత సంఖ్య పెరుగుతున్నప్పటికీ, ఆ స్థాయిలో ఉద్యోగాలు సృష్టించకపోతే నిరుద్యోగం పెరుగుతుంది. విద్యావంతులైన యువతకు కూడా తగిన ఉద్యోగాలు లభించకపోవడం సామాజిక, ఆర్థిక సమస్యలకు దారితీస్తుంది. ఫలితంగా కుటుంబాలపై ఆర్థిక భారం పెరగడంతో పాటు యువతలో అసంతృప్తి కూడా పెరిగే అవకాశం ఉంటుంది.

జనాభా పెరుగుదల పట్టణాలపై మరింత ఒత్తిడిని పెంచు తోంది. ఉపాధి, విద్య, వైద్యం కోసం గ్రామాల నుంచి పట్టణాలకు వలసలు పెరగడంతో నగరాల్లో జనసాంద్రత అధికమవుతోంది. ఫలితంగా ట్రాఫిక్ సమస్యలు, గాలి కాలుష్యం, నీటి కొరత, చెత్త నిర్వహణ, నివాస సమస్యలు తీవ్రతరం అవుతున్నాయి. ప్రణాళిక లేని పట్టణీకరణ వల్ల ప్రకృతి వనరులు దెబ్బతింటున్నాయి.

పర్యావరణంపై జనాభా పెరుగుదల ప్రభావం మరింత స్పష్టంగా కనిపిస్తోంది. జనాభా పెరిగే కొద్దీ ఇళ్ల నిర్మాణం, రహదారులు, పరిశ్రమలు, వినియోగ వస్తువుల అవసరం పెరుగుతుంది. దీనికోసం అడవుల నరికివేత, సహజ వనరుల వినియోగం పెరుగుతుంది. ఫలితంగా జీవవైవిధ్యం తగ్గడం, కాలుష్యం పెరగడం, వాతావరణ మార్పులు వేగవంతం కావడం వంటి పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. అయితే జనాభా పెరుగుదలను కేవలం భారంగా చూడటం కూడా సరైంది కాదు. యువ జనాభా ఒక దేశానికి గొప్ప ఆస్తి. వారికి నాణ్యమైన విద్య, నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పిస్తే జనాభా మానవ వనరుగా మారుతుంది. అదే విధంగా ప్రజలకు ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, విద్య, మహిళా సాధికారతపై అవగాహన కల్పించడం ద్వారా జనాభా పెరుగుదలను సమతుల్యంగా నిర్వహించవచ్చు. జనాభా పెరుగుదల వల్ల నష్టపోయేది ఒక్క వర్గం కాదు. సహజ వనరులు తగ్గితే భవిష్యత్ తరాలు నష్టపోతాయి. ఉపాధి అవకాశాలు తగ్గితే యువత నష్టపోతుంది. నీటి కొరత పెరిగితే రైతులు, పట్టణ ప్రజలు నష్టపోతారు. కాలుష్యం పెరిగితే ప్రతి ఒక్కరి ఆరోగ్యం ప్రభావితమవుతుంది. అందువల్ల జనాభా పెరుగుదల ప్రభావం సమాజంలోని ప్రతి వర్గానికీ చేరుతుంది. జనాభా పెరుగుదల అనేది కేవలం సంఖ్యల పెరుగుదల కాదు.. అది వనరులపై పెరుగుతున్న ఒత్తిడి. జనాభాకు అనుగుణంగా వనరులు, ఉపాధి, విద్య, వైద్యం, నివాస సదుపాయాలు పెంచకపోతే భవిష్యత్‌లో సమస్యలు మరింత తీవ్రమవుతాయి. అందుకే జనాభా నియంత్రణతో పాటు మానవ వనరుల అభివృద్ధి, సహజ వనరుల సంరక్షణ, స్థిరమైన అభివృద్ధి అత్యంత అవసరం. ఈ రోజు మనం తీసుకునే నిర్ణయాలే రేపటి తరాల భవిష్యత్తును నిర్ణయిస్తాయి. జనాభా పెరుగుదలను భారంగా కాకుండా, సరైన ప్రణాళికతో దేశ అభివృద్ధికి ఉపయోగపడే శక్తిగా మార్చుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలకే కాదు.. ప్రతి పౌరుడిదీ.

**వ్యాసకర్త**
**డాక్టర్ మోటె చిరంజీవి,**
**సామాజిక వేత్త, విశ్లేషకులు.**
**సెల్ : 9949194327.**

# శాశ్వత భవనం నిర్మించాలి

**బీజేపీ ఎస్టీ మోర్చా ఆధ్వర్యంలో ధర్నా.**

**అక్కన్నపేట, సెప్టెంబర్ 3(తెలంగాణ వాణి ఆర్ సి)**

అక్కన్నపేట మండల కేంద్రంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలకు శాశ్వత భవనం నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఎస్టీ మోర్చా అధ్యక్షుడు సునావత్ మోహన్ నాయక్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ అక్కన్నపేట మండల అధ్యక్షుడు రామంచ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ, గత ప్రభుత్వం హుస్నాబాద్‌లో ఏర్పాటు చేసిన గిరిజన బాలికల గురుకుల పాఠశాల, కొత్త ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులు పూర్తవుతున్నప్పటికీ, ఇప్పటికీ అక్కడే కొనసాగడం సముచితం కాదన్నారు. అక్కన్నపేటలో పాఠశాల నిర్మాణం కోసం గతంలో కేటాయించిన 7.5 ఎకరాల భూమిని ఆక్రమణల నుంచి పోరాడి కాపాడుకున్నామని తెలిపారు.



భవన నిర్మాణానికి రూ.25 కోట్ల నిధులుకేటాయించినప్పటికీ పనులు ప్రారంభించక పోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శన మన్నారు. పాఠశాలకు సొంత భూమి అందుబాటులో ఉన్నప్పటికీ నిర్మాణ పనులు చేపట్టకపోవడం వల్ల గిరిజన విద్యార్థినులకు తీవ్రఅన్యాయంజరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మోహన్ నాయక్ మాట్లాడుతూ శాశ్వత భవన నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని, లేనిపక్షంలో రాబోయే రోజుల్లో ప్రతి తండాలో ప్రభుత్వాన్ని నిలదీసి ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో బీజేపీ వరంగల్ ఎస్టీ మోర్చా జిల్లా ఇన్‌చార్జి గుగులోత్ తిరుపతినాయక్, జిల్లా కోఆపరేటివ్ కన్వీనర్ వేణుగోపాల్‌రావు, మండల ప్రధాన కార్యదర్శులు చెరుకు సంపత్, మడక రవికుమార్, జిల్లా ఎస్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి గుగులోత్ లక్ష్మీపతి, సర్పంచ్ తిరుపతి, ఉప సర్పంచులు చొక్కారెడ్డి, అర్జున్‌నాయక్, మండల కార్యదర్శులు పంగ శ్రీనివాస్‌రెడ్డి, రైనా నాయక్, ప్రసాద్, ఉపాధ్యక్షులు, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు సాలేంద్ర తిరుపతి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దమ్ముంటే చర్చకు రా..రసమయికి కాంగ్రెస్ సవాల్

**తిమ్మాపూర్, సెప్టెంబర్ 3, ( తెలంగాణ వాణి ప్రతినిధి )**

మానకొండూరు నియోజకవర్గ అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేష్ గౌడ్ సవాల్ విసిరారు. నుస్తులాపూర్ గ్రామంలో గురువారం నిర్వహించిన "ప్రజాపాలన విజయోత్సవ సంబరాల" వేదికగా ఆయన మాట్లాడారు. చర్చకు సంబంధించిన తేదీ, సమయాన్ని రసమయే ఖరారు చేయాలన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఇళ్లు, పెన్షన్లు, కేజీ టు పీజీ విద్య, రుణమాఫీ అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని రమేష్ గౌడ్ విమర్శించారు. ప్రజలు తిరస్కరించినా బీఆర్ఎస్ నేతలు తీరు మార్చుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వంపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రైతు రుణమాఫీ, మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇళ్ల పథకాల ద్వారా పేదలకు అండగా నిలుస్తున్నామని, మహిళలకు రూ.1,900 కోట్ల వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని తెలిపారు. నుస్తులాపూర్ సొసైటీ చైర్మన్ మోరపల్లి రమణారెడ్డి మాట్లాడుతూ.. ప్రతిపక్షాలు నిర్మాణాత్మకంగా వ్యవహరించాలని, వ్యక్తిగత దూషణలకు దిగితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ నాయకులు




దావు సంపత్ రెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాసరావు, శ్రీగిరి రంగారావు, కుంట రాజేందర్ రెడ్డి, మామిడి అనిల్ కుమార్, బుధారపు శ్రీనివాస్, కొత్త తిరుపతిరెడ్డి, కొండల్ రావు, బుధారపు శ్రీనివాస్,అసోధ శ్రీనివాస్, పోలు రాము,రమేశ్, చింతల లక్ష్మారెడ్డి, గొట్టెముక్కుల సంపత్ రెడ్డి, గంకిడి లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, తమ్మనవేణి రాములు యాదవ్, జావీద్, చింతల తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లందకుంటలో ఘనంగా ప్రజాపాలన విజయోత్సవ బైక్ ర్యాలీ



**ఇల్లందకుంట, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి)**

ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ పిలుపు మేరకు, డీసీసీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం, హుజురాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ ఆదేశాలతో మండల అధ్యక్షుడు పెద్ది కుమార్ నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. సుమారు 200 మంది కార్యకర్తలు బైక్ ర్యాలీలో పాల్గొని, అనంతరం బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో అమలు చేస్తోందని తెలిపారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలతో ప్రజలకు అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. పేదరిక నిర్మూలన, సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గూడెపు సారంగపాణి, ఎక్కటి సంజీవరెడ్డి, కనుమల్ల సంపత్, అన్నం ప్రవీణ్, వంగ రామకృష్ణతో పాటు సర్పంచులు ఏలేటి నిర్మల రఘుపతిరెడ్డి, గుత్తికొండ రమ్య రవికుమార్, మస్కె రేణుక కుమార్, ప్యాక్స్ చైర్మన్లు, మార్కెట్ డైరెక్టర్లు, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, మహిళా కాంగ్రెస్ నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు, వార్డు సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జమ్మికుంట మార్కెట్ యార్డుకు మూడు రోజుల సెలవు

**జమ్మికుంట, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి ప్రతినిధి):**

శ్రీకృష్ణాష్టమి సందర్భంగా జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ యార్డుకు మూడు రోజుల పాటు సెలవు ప్రకటించినట్లు మార్కెట్ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న--సదానందం తెలిపారు. సెప్టెంబర్ 4, 5 తేదీల్లో పండుగ, ప్రత్యేక సెలవులు, 6న ఆదివారం కావడంతో మార్కెట్ యార్డు మూసి ఉంటుందని పేర్కొన్నారు. సెప్టెంబర్ 7, సోమవారం నుంచి మార్కెట్ యార్డు యథావిధిగా పనిచేస్తుందని తెలిపారు. రైతులు ఈ విషయాన్ని గమనించి సెలవు రోజుల్లో వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు తీసుకురావద్దని సూచించారు.




## కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ పోరుబాట

**హామీల అమలుకు ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి డిమాండ్**



**వీణవంక, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి)**

ఎన్నికల హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ హుజూరాబాద్ నియోజకవర్గంలోని వీణవంక మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ ఆందోళనలో సుమారు రెండు వేల మంది కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ రూపొందించిన లి'కాంగ్రెస్ బాకీ కార్డు'లిలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఆరు గ్యారెంటీలు సహా ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామని నమ్మబలికిన కాంగ్రెస్, ఇప్పటివరకు ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో నెరవేర్చలేదని విమర్శించారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, క్వింటాలుకు రూ.500 బోనస్, రైతు భరోసా అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. మహిళలకు నెలకు రూ.2,500 సాయం, కల్యాణలక్ష్మిలో తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు, నిరుద్యోగ భృతి, పింఛన్ల పెంపు వంటి కీలక హామీలను గాలికొదిలేశారని ఆరోపించారు. ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లించాల్సిన బాకీలను తక్షణమే చెల్లించాలని, హామీలన్నీ నెరవేర్చే వరకు బీఆర్ఎస్ రాజీలేని పోరాటం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బండ శ్రీనివాస్, వాల బాలకిషన్‌రావు, ముసిపట్ల తిరుపతిరెడ్డి, మాడ సదావరెడ్డి, విజయ భాస్కర్‌రెడ్డి, కామిడి శ్రీనివాస్‌రెడ్డి, సిద్ధిపల్లి మహిపాల్‌రెడ్డి, నీల కుమారస్వామి, దాసరపు రాధాకృష్ణ, కాసర్ల సుధాకర్, జక్కు నారాయణ, ముత్యాల శంకర్, నాగిడి సంజీవరెడ్డి, కాంతారెడ్డి మధుసూదన్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, అడిగిప్పుల సత్యనారాయణతో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశంలో పాల్గొన్న ఎంపీడీవో



**నాగిరెడ్డిపేట (తెలంగాణ వాణి)**

మండలంలోని జలాల్‌పూర్‌లో గురువారం ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమం ఎంపీడీవో గంగాధర్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. అనంతరం ఆయన గ్రామంలోని బోర్వెల్ రీఛార్జ్ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామ సర్పంచ్ , గ్రామ పాలకవర్గం , గ్రామ పెద్దలు , తదితరులు పాల్గొన్నారు .

## రైతు బాంధవుడు కేసీఆర్.. రైతు ద్రోహి రేవంత్ రెడ్డి.

**బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వ్యాల హరీష్ రెడ్డి ధ్వజం**



**పెద్దపల్లి , సెప్టెంబర్,3(తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి )**

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేదని నిరసిస్తూ చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా పాలకుర్తి మండలం బసంత్‌నగర్‌లోని జీఎం గార్డెన్‌లో రెండో రోజు "వ్యవసాయ విధ్వంసం--22ఏ" అంశంపై రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వ్యాల హరీష్ రెడ్డి మాట్లాడుతూ "రైతు బాంధవుడు కేసీఆర్.. రైతు ద్రోహి రేవంత్ రెడ్డి" అని విమర్శించారు. కేసీఆర్ పాలనలో రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత విద్యుత్‌తో పాటు సాగునీటి ప్రాజెక్టుల ద్వారా రైతులకు అండగా నిలిచారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు హామీని పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని, రైతుబీమాపై నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. యూరియా, డీఏపీ కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని, యూరియా బస్తా రూ.270కు లభించాల్సి ఉండగా బ్లాక్ మార్కెట్‌లో రూ.500 వరకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. వరి కొనుగోళ్లలో కోతలు విధిస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో సాగునీరు, ఉచిత విద్యుత్, రైతుబంధు, సకాలంలో ఎరువుల సరఫరాతో రైతులకు భరోసా కల్పించడంతో పాటు భూముల విలువలు కూడా పెరిగాయని హరీష్ రెడ్డి అన్నారు. ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు ప్రభుత్వ విధానాలే కారణమని విమర్శించారు. రైతుల కన్నీళ్లతో నడిచే ప్రభుత్వం ఎంతోకాలం నిలవదని, రాబోయే ఎన్నికల్లో రైతులు, అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన సమాధానం చెబుతారని హరీష్ రెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, మేకల సమ్మయ్య యాదవ్, అల్లం నారాయణ, బండారి ప్రవీణ్, జహీద్ భాషా, పోలాడి శ్రీనివాసరావు, బూరుగు వంశీకృష్ణ, బక్కి కిషన్, చొప్పరి శ్రీనివాస్, సార్ల ఉదయ్, ఎర్రవెల్లి శ్రీనివాసరావు, నూతి రాజకుమార్, కొండ సురేష్, పోయిల రవి, మేకల రామస్వామి, బొట్ల పోషం, గొర్రె శంకర్, గొర్రె నర్సింగ్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అంటేనే కబ్జాలు, సెటిల్‌మెంట్లు : హరీశ్‌రావు



**నర్సాపూర్ (తెలంగాణ వాణి)**

ఎన్నికల హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కౌడిపల్లి మండల కేంద్రంలో గురువారం భారీ రైతు ధర్నా నిర్వహించారు. నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతా లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రైతు భరోసా, పూర్తిస్థాయి రుణమాఫీ, రైతు బీమా, ఎరువుల కొరత, సాగునీటి ఇబ్బందులను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలు తీరేంత వరకు బీఆర్ఎస్ పార్టీ వారి పక్షాన పోరాడుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రామగౌడ్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పట్లోళ్ల శ్రీనివాస్ సహా పలువురు ప్రజాప్రతినిధులు, రైతులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉద్యోగుల హామీలు అమలు చేయాలి : బీఎస్పీ నేత రవీందర్‌గౌడ్




**హుస్నాబాద్, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి ఆర్.సి)**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులైనా ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం అన్యాయమని బీఎస్పీ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటకు కట్టుబడి వెంటనే పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలతో ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, కొత్త పీఆర్సీ (గ్రా=జ) అమలుతో పాటు పెండింగ్‌లో ఉన్న ఆరు విడతల డీఏలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని సైతం సక్రమంగా అమలు చేయాలని ఆయన కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం బీఎస్పీ నిరంతరం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు వేల్పుల రాజు, సుధాకర్, శరత్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణుడి నుంచి నాయకత్వ లక్షణాలు నేర్చుకోవాలి





**వనపర్తి, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
తిరుమలహిల్స్‌లోని రేడియంట్ హైస్కూల్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కృష్ణుడు ధర్మ పరిరక్షణతో పాటు గొప్ప స్నేహితుడు, మార్గదర్శకుడు, నాయకుడిగా నిలిచారని అన్నారు. కురుక్షేత్రంలో అర్జునుడికి భగవద్గీతను బోధించి మానవాళికి కర్మయోగ సందేశాన్ని అందించారని పేర్కొన్నారు. నేటి యువత శ్రీకృష్ణుడి జీవితం నుంచి నాయకత్వ లక్షణాలు, స్నేహం, ధర్మం, ప్రేమ, కరుణ వంటి విలువలను నేర్చుకోవాలని సూచించారు. వేడుకల్లో భాగంగా చిన్నారుల కృష్ణుడి వేషధారణ పోటీలు, ఉట్టి కొట్టడం, కోలాటం, భజనలు, గీతా పారాయణం నిర్వహించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందిస్తాయని శంకర్ గౌడ్ అన్నారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ కౌసల్య భాస్కర్, ప్రిన్సిపాల్ ఉప్పరి తిరుమలేష్, వైస్ ప్రిన్సిపాల్ బి.రాము, ఎకో క్లబ్ కన్వీనర్ శృతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, సాహితీ కళా వేదిక సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమా?

### జీవో 97ను వెంటనే రద్దు చేయాలి.. పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేయొద్దు

**మల్హర్‌రావు, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
పాలిటెక్నిక్ కళాశాలలను ఐటీఐ, ఏటీసీలతో అనుసంధానం చేసేలా ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 97ను వెంటనే రద్దు చేయాలని యునైటెడ్ ఫోరమ్ ఫర్ ఆర్టీఐ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కన్వీనర్ చర్లపల్లి వెంకటేశ్వర్లు గౌడ్, కోకన్వీనర్ చింతల కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం వారు మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి విద్యార్థులకు పాలిటెక్నిక్ విద్య ఎంతో కీలకమని, ఈ నిర్ణయంతో విద్యా ప్రమాణాలు దెబ్బతినే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. నిర్ణయాలు తీసుకునే ముందు విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యావేత్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. సమస్య పరిష్కారానికి హైపవర్ కమిటీ పేరుతో కాలయాపన చేయకుండా ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని, పాలిటెక్నిక్ విద్యను బలోపేతం చేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని వారు కోరారు.




## సూర్యాపేట పట్టణ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ

- 24 గంటల గస్తీ, సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆదేశం
- వినాయక చవితి ఉత్సవాలకు ముందస్తు అనుమతి తప్పనిసరి.. డీజేలకు అనుమతి లేదు




**సూర్యాపేట, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి):**
జిల్లా కేంద్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ నరసింహ, ఐపీఎస్ ఆదేశించారు. గురువారం సూర్యాపేట పట్టణ పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి స్టేషన్ పరిసరాలు, సిబ్బంది విధులు, బాధితులకు అందుతున్న సేవలను పరిశీలించారు. పట్టణంలో అసాంఘిక కార్యకలాపాలు, అక్రమ రవాణాపై నిఘా పెంచాలని, పెట్రోకార్, బ్లూకోట్స్ సిబ్బందితో 24 గంటల గస్తీ నిర్వహించాలని సూచించారు. అనుమానితుల కదలికలపై నిఘా ఉంచడంతో పాటు వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలని, నేరాల నియంత్రణకు మరిన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వినాయక చవితి సందర్భంగా ఉత్సవ కమిటీలు ముందస్తు అనుమతులు తీసుకోవాలని, రాకపోకలకు ఇబ్బంది కలిగించేలా రోడ్లపై మండపాలు ఏర్పాటు చేయవద్దని సూచించారు. విగ్రహాలకు నంబరింగ్ కేటాయించి నిమజ్జన మార్గాలను ముందుగానే పరిశీలించాలని, శాంతి సమావేశాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ఈ తనిఖీలో పట్టణ సీఐ వెంకటయ్య, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఎస్ఐలు సాయిరాం, రామచందర్, రహీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## కాకతీయ యూనివర్సిటీ ఎల్ఎల్‌బీ పరీక్షలు వాయిదా

**హనుమకొండ, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి):**
సెప్టెంబర్ 7, 8 తేదీల్లో జరగాల్సిన కాకతీయ విశ్వవిద్యాలయం ఎల్ఎల్‌బీ మూడేళ్ల కోర్సు 2, 4వ సెమిస్టర్లు, ఐదేళ్ల కోర్సు 6, 8వ సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల తెలిపారు. వాయిదా పడిన పరీక్షల తేదీలను త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు తదుపరి ప్రకటనలను గమనించాలని సూచించారు.

## శాంతియుత ధర్నాను దాడిగా చిత్రీకరించడం కాంగ్రెస్ దివాళాకోరుతనం

### బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి నక్క మహేష్

**వనపర్తి, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
వనపర్తిలో బీజేపీ నిర్వహించిన శాంతియుత ధర్నాను కాంగ్రెస్ నాయకులు దాడిగా చిత్రీకరిస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి నక్క మహేష్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట బీజేపీ కార్యకర్తలు కేవలం ప్లకార్డులతో శాంతియుతంగా నిరసన తెలిపారని, తమ వద్ద ఎలాంటి ఆయుధాలు లేవని అన్నారు. అయినప్పటికీ పోలీసులు బీజేపీ కార్యకర్తలను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించడం ప్రజాస్వామ్య విరుద్ధమని విమర్శించారు. బీజేపీది దాడుల సంస్కృతి కాదని, సేవా, దేశభక్తి సంస్కృతి అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతి, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా బీజేపీ పోరాటం కొనసాగుతుందని నక్క మహేష్ స్పష్టం చేశారు.




## ఎస్ఐఆర్--2 ప్రక్రియను పరిశీలించిన కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

**ఆధారాలతో ఓటర్ల వివరాలు సేకరించాలని బీఎల్ఏలకు సూచన**

**వీణవంక, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
మండలంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్--2 ప్రక్రియను హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎస్ఐఆర్ ఇన్‌చార్జి కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కొండపాక గ్రామంలోని 97, 98 బూత్‌ల పరిధిలో నోటీసులు అందుకున్న ఓటర్ల ఇళ్లకు బీఎల్ఏలు, బీఎల్‌వోలతో కలిసి వెళ్లి వివరాలు, సంబంధిత ఆధారాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2002 ఓటరు జాబితా మ్యాపింగ్‌లో పేర్లు, తండ్రి పేర్లు, వయస్సుల్లో వ్యత్యాసాల కారణంగా కొందరికి నోటీసులు అందాయని తెలిపారు. ప్రతి ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైన ఆధారాలను సేకరించాలని బీఎల్ఏలకు సూచించారు. తుది ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఉండేలా బాధ్యతగా పనిచేయాలని కోరారు. ఈ



కార్యక్రమంలో మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ సాహెబ్ హుస్సేన్, నియోజకవర్గ ఈఆర్వో కోఆర్డినేటర్ మొలుగూరి సదయ్య, గ్రామ సర్పంచ్ దాట్ల వీరాస్వామి, ఈదునూరి పైడికుమార్, మ్యాడగోని శ్రీనివాస్, మహమ్మద్ సజ్జు, బీఎల్ఏలు రామకృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు జీవన నైపుణ్యాలపై అవగాహన

**-- ఏబీసీ 3.0 ప్రాజెక్ట్ డైరెక్టర్ సునీత రాకేష్ కొర్రపాటి**

**మెదక్, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఏబీసీ 3.0 (అవేర్‌నెస్ బిహేవియర్ క్యాంపెయిన్)లో భాగంగా భూపతిపూర్ ప్రభుత్వ పాఠశాలలో సుమారు 250 మంది విద్యార్థులకు జీవన నైపుణ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లైఫ్ స్కిల్స్ ట్రైనర్, ఏబీసీ 3.0 ప్రాజెక్ట్ డైరెక్టర్ సునీత రాకేష్ కొర్రపాటి విద్యార్థులతో ఇంటరాక్టివ్‌గా మాట్లాడారు. తమను తాము తెలుసుకోవడం, వ్యక్తిత్వ వికాసం, బలాలు--బలహీనతలను గుర్తించడం, సరైన నిర్ణయాలు తీసుకోవడం, ఇతరుల ప్రభావానికి లోనుకాకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే పిల్లల రక్షణకు సంబంధించిన చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 తదితర సేవల గురించి వివరించారు. విద్యార్థుల్లో సానుకూల ప్రవర్తనా మార్పు తీసుకురావడమే ఏబీసీ 3.0 ప్రధాన లక్ష్యమని సునీత



తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీ సోలమన్ రాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖకు చెందిన సంకల్ప్ హబ్ నాగమణి లైఫ్ స్కిల్స్ ట్రైనర్ శ్రీమతి సునీత రాకేష్ కొర్రపాటి ఉపాధ్యాయులు మరియు సుమారు 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## వృద్ధ దంపతులను బెదిరించి దోపిడీ.. ముగ్గురు అరెస్ట్

### 36 గంటల్లో కేసును ఛేదించిన పోలీసులు

**నాగిరెడ్డిపేట, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
వృద్ధ దంపతులను బెదిరించి వెండి గొలుసు, నగదు దోచుకెళ్లిన ఘటనలో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ భార్గవ్ గౌడ్ తెలిపారు. గత నెల 31న గోపాలపేట హాస్పిటల్ సమీపంలో దంపతులను బెదిరించిన నిందితులు వారి వద్ద నుంచి 12 తులాల వెండి గొలుసు, రూ.15 వేల నగదు తీసుకుని స్కూటీపై పరారయ్యారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించి, ఇంటెలిజెన్స్ సమాచారంతో 36 గంటల్లోనే నిందితులను గుర్తించారు. ధర్మశంకర్ చౌహాన్, రమేష్ చంద్ర చౌహాన్, శివాజీ చౌహాన్‌లుగా గుర్తించిన నిందితులను పోచారం చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీల్లో



పట్టుకున్నారు. వారి నుంచి వెండి గొలుసు, నంబర్ ప్లేట్ లేని స్కూటీ, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

## హరి అశోక్‌కుమార్‌కు నంది పురస్కారం

**జగిత్యాల, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: సమాజ సేవలో విశేష కృషి చేస్తున్న రిటైర్డ్ తహసీల్దార్, న్యాయవాది హరి అశోక్‌కుమార్‌కు నంది పురస్కారం లభించింది. సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ జిల్లా అధ్యక్షుడిగా వృద్ధుల సంక్షేమానికి సేవలందించడంతో పాటు పొగాకు నియంత్రణలో కృషి చేసినందుకు ఈ పురస్కారానికి ఎంపిక య్యారు. తెలంగాణ సాంస్కృతిక శాఖ సహకారంతో గానకోకిల కళానికేతన్ 34వ వార్షికోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 4న జగిత్యాలలోని ఉమాశంకర్ గార్డెన్స్‌లో జరిగే కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి అడ్లూరి



లక్ష్మణ్‌కుమార్ చేతుల మీదుగా హరి అశోక్‌కుమార్‌కు నంది పురస్కారం అందజేయనున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎలిగేటి రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ గౌరవ అధ్యక్షులు ఎమ్మెల్సీ ఎల్. రమణ, ఎం పి ధర్మపురి అరవింద్, ఎమ్మెల్యే సంజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ టి. జీవన్ రెడ్డి, జగిత్యాల, ధర్మపురి మున్సిపల్ చైర్ పర్సన్ లు సమిండ్ల వాణి, నాగ లక్ష్మి జిల్లా ప్రముఖులు పాల్గొంటారని, వారు వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న వారికి నంది పురస్కారాలు అందజేస్తారని తెలిపారు.

## 5, 6, 12, 13 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు

**నిజామాబాద్, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)లో భాగంగా సెప్టెంబర్ 5, 6, 12, 13 తేదీల్లో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భవేష్ మిశ్రా తెలిపారు. శిబిరాల్లో బీఎల్ఓలు అందుబాటులో ఉండటంతో పాటు ఫారం-6, 7, 8లను



అందుబాటులో ఉంచుతారు. కొత్త ఓటరు నమోదుకు ఫారం-6, పేరు తొలగింపు లేదా అభ్యంతరాలకు ఫారం-7, వివరాల సవరణలు, చిరునామా మార్పులకు ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అర్హులైన ఓటర్లు ముసాయిదా జాబితాను పరిశీలించి, అవసరమైన మార్పులు, సవరణలు లేదా కొత్త నమోదు కోసం సమీప పోలింగ్ కేంద్రాన్ని సందర్శించాలని కలెక్టర్ సూచించారు.



## నారాయణ కాలేజీకి అనుమతి లేదు

### తరగతులు నిర్వహించినా.. ఫీజులు వసూలు చేసినా కఠిన చర్యలు

**నిజామాబాద్, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
నిజామాబాద్ పట్టణ శివారులోని కేశాపూర్‌లో నారాయణ కాలేజీ పేరుతో నిర్వహిస్తున్న జూనియర్ కళాశాలకు ఇంటర్ బోర్డు నుంచి ఎలాంటి అనుమతి లేదని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి తిరుమలపూడి రవికుమార్ తెలిపారు. గురువారం కళాశాల ప్రాంగణాన్ని ఆయన పరిశీలించి నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. అనుమతి లేకుండా తరగతులు నిర్వహించినా, నారాయణ కాలేజీ పేరుతో విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు విద్యా సంవత్సరం నష్టపోకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, కళాశాల అనుమతులు ఉన్నాయో లేదో నిర్ధారించుకున్న తర్వాతే తమ పిల్లలను చేర్పించాలని డీఐఈఓ సూచించారు.

## నారాయణ స్కూల్‌లో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**నిజామాబాద్, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి):**
నిజామాబాద్ సుభాష్‌నగర్‌లోని నారాయణ స్కూల్‌లో గురువారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి ఏజీఎం సూర్యవంశీ శివాజీ వేడుకలను ప్రారంభించారు. విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధాదేవి వేషధారణలో ఆకట్టుకున్నారు. ప్రత్యేకంగా నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. శ్రీకృష్ణుడి జీవితం, భగవద్గీత సందేశం, ధర్మం, కర్తవ్యనిష్ఠ, నైతిక విలువలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జి. చందన, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## రైతు హామీలు అమలు చేయాలి

### కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి



**తెలంగాణ వాణి, ఉమ్మడి వరంగల్ బ్యూరో, (సెప్టెంబర్ 3 )**
: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవ రెడ్డి డిమాండ్ చేశారు. దాస్యం వినయ్ భాస్కర్ ఆదేశాల మేరకు కాజీపేట చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు సదస్సులో ఆయన మాట్లాడారు. రైతు భరోసా, రుణమాఫీ, పంటల కొనుగోళ్లు, మద్దతు ధర, పంట నష్టపరిహారం వంటి అంశాల్లో ప్రభుత్వం రైతులకు న్యాయం చేయాలని కోరారు. బీఆర్ఎస్ హయాంలో రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలతో రైతులకు అండగా నిలిచామని పేర్కొన్నారు. రైతుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. మాజీ కార్పొరేటర్ దాస్యం విజయ్ భాస్కర్ మాట్లాడుతూ రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం కాజీపేట జంక్షన్‌లో బాకీ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పాత బస్టాండ్‌ను అభివృద్ధి చేయకుంటే ఆందోళన

- నెల రోజుల్లో పనులు ప్రారంభించాలి..
- అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు

డా. సతీష్ యాదవ్



**వనపర్తి, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
నాలుగైదు జిల్లాలకు రాకపోకలకు కీలకంగా ఉన్న వనపర్తి పాత బస్టాండ్‌ను వెంటనే ఆధునీకరించాలని అఖిలపక్ష ఐక్య వేదిక, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పాత బస్టాండ్‌ను పరిశీలించిన ఐక్యవేదిక అధ్యక్షుడు డా. సతీష్ యాదవ్ మాట్లాడుతూ.. నియోజకవర్గానికి వేల కోట్ల నిధులు తెచ్చామని చెబుతున్న నాయకులు రూ.2 కోట్లతో బస్టాండ్‌ను అభివృద్ధి చేయలేరా? అని ప్రశ్నించారు. తాగునీరు, మరుగుదొడ్లు, నీడ వంటి కనీస సౌకర్యాలు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజా సమస్యలపై దృష్టి సారించి, పాత బస్టాండ్‌లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. నెల రోజుల్లో అభివృద్ధి పనులు ప్రారంభించకపోతే ప్రజా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రామకృష్ణ మహారాజ్, వెంకటేశ్వర్లు, కొత్తగొల్ల శంకర్, రాజనగరం రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీ అభివృద్ధికి రూ.38 లక్షలు

### విద్యార్థినులకు మెరుగైన మౌలిక వసతులే లక్ష్యం: ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**జనగామ, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
దేవరుప్పుల మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో రూ.38 లక్షలతో చేపట్టనున్న అదనపు తరగతి గదులు, టాయిలెట్లు, శానిటేషన్, ఇతర మౌలిక వసతుల అభివృద్ధి పనులకు పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. బాలికల ఆరోగ్యం, పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ అవసరమైన మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. కేజీబీవీకి మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, విద్యార్థినులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## యూనివర్సల్ పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు



**పెద్దపల్లి, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
పాలకుర్తి మండలం ఘనశ్యామ్‌దాస్‌నగర్ గ్రామపంచాయతీ పరిధిలోని యూనివర్సల్ నీట్, ఐఐటీ ఫౌండేషన్ హైస్కూల్‌లో గురువారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, బాలకృష్ణుల వెన్న దొంగిలించే ఘట్టం ఆకట్టుకున్నాయి. పాఠశాల కరస్పాండెంట్ మహమ్మద్ ఇసాయిల్, ప్రధానోపాధ్యాయులు సయ్యద్ అఫల్ విద్యార్థులకు శ్రీకృష్ణాష్టమి విశిష్టతను వివరించారు. అనంతరం బాలకృష్ణులతో కేక్ కట్ చేయించి, ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

## ఐటీడీఏ పీఓ రాహుల్‌కు వైద్యుల ఆహ్వానం



**పారంపర్య వైద్యుల మహా సంఘం (పి.వి.ఎం.ఎస్.)**
తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభలకు అతిథిగా రావాలని కోరుతూ ఐ.టీ.డీ.ఏ. పీ.వో బి. రాహుల్ (ఐఏఎస్) కు పారంపర్య వైద్యులు ఆహ్వాన పత్రికను అందించారు. గురువారం భద్రాచలంలోని ఆయన చాంబర్లో ఆహ్వాన పత్రికను అందించి, మహాసభల వివరాలను తెలియజేశారు. భద్రాచలంలో ఈ నెల 8, 9 ,10 తేదీలలో (మంగళవారం నుండి గురువారం వరకు) రామాలయ సమీపంలో గల 'శ్రీ మార్కండేయ పద్మశాలి భవన్లో' జరుగనున్న రాష్ట్ర మూడవ మహాసభలకు హాజరు కావలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రాహుల్ నిర్వాహకులను అభినందించారు. ఆయుర్వేద మూలాలను సామాన్యుల వరకు తీసుకువెళ్లేందుకు కృషి చేయడం అభినందనయం అన్నారు. ఆయనకు ఆహ్వాన పత్రికను అందించిన వారిలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వైద్య. రామంచి శ్రీనివాస్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కన్వీనర్ వైద్య. జి. సుగుణారావు, వైద్య. తూము రమేష్, దశరథ్ రజువా, కె. మహేందర్, తీగల రమేష్ లు పాల్గొన్నారు.

## కేస్లాపూర్ నాగోబ ఆలయ అభివృద్ధికి రూ.21 కోట్లు

### అభివృద్ధి పనులకు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే బొజ్జు పటేల్



**ఇంద్రవెల్లి, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి):**
మండలంలోని ప్రసిద్ధ కేస్లాపూర్ శ్రీ నాగోబ దేవాలయ అభివృద్ధికి ప్రభుత్వం రూ.21 కోట్లు మంజూరు చేయడంతో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ గురువారం అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ంతకుముందు నాగోబ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ, మెస్రం వంశస్థులు, అధికారులు, ప్రజాప్రతినిధులతో అభివృద్ధి పనులపై సమీక్షించారు. మంజూరైన నిధులతో వీఐపీ గెస్ట్‌హౌస్, ఆలయ ముఖద్వారం, కోనేరు పొడిగింపు, గార్డెన్ తదితర మౌలిక వసతులను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. నాగోబ ఆలయం ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మెస్రం వంశస్థులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## రెడ్ల నిరసన దీక్షను విజయవంతం చేయాలి

### -- రెడ్డి సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కరుణాకర్‌రెడ్డి




**నిజామాబాద్, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి):**
రెడ్డి కార్పొరేషన్‌కు రూ.1,000 కోట్ల నిధులు కేటాయించడంతో పాటు వెంటనే పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 8న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న రెడ్ల నిరసన దీక్షను విజయవంతం చేయాలని రెడ్డి సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లవెల్లి కరుణాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం నిజామాబాద్‌లో దీక్షకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ.. రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు, రైతు బీమా కొనసాగింపు, ఈడబ్ల్యూఎస్ 10 శాతం రిజర్వేషన్‌ను అన్ని ప్రభుత్వ విభాగాల్లో పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. పేద రెడ్లు, అగ్రవర్ణ పేదలకు న్యాయం చేయాలనే డిమాండ్లతో చేపడుతున్న దీక్షకు ప్రతి రెడ్డి కుటుంబం నుంచి ఒకరు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గాదరీ సంజీవరెడ్డి, సిహెచ్ శ్రీనివాస్ రెడ్డి, రమేష్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి పాల్గొన్నారు.

## నిర్మల్ పోలీస్ అధికారుల సంఘానికి నూతన కార్యవర్గం

### -- సామరస్య పద్ధతిలో ఏకగ్రీవ ఎన్నిక




**నిర్మల్, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
నిర్మల్ జిల్లాలో పోలీస్ అధికారుల సంఘం ఎన్నికలు గురువారం ప్రశాంతంగా నిర్వహించారు. వివిధ పోలీస్ స్టేషన్లు, విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొనగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దండేకర్ సాయి, ఉపాధ్యక్షులుగా కృష్ణ, సాయి కృష్ణ, కార్యదర్శిగా శ్రీకాంత్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రామ్ నిరంజన్, జాయింట్ సెక్రటరీగా సంతోష్, కోశాధికారిగా మాధవ్ ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా మహేందర్‌రెడ్డి, సాయి కిరణ్ జాదవ్, శంభు, గంగాధర్, పెర్సిస్, టి.వి. రమణ ఎన్నికయ్యారు. జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల మాట్లాడుతూ.. పోలీస్ సిబ్బంది సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని నూతన కార్యవర్గానికి సూచించారు. సిబ్బంది, వారి కుటుంబాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. నూతన కార్యవర్గ సభ్యులను ఎస్పీ అభినందించారు.

## రైతు ఏడ్చిన రాజ్యం.. వ్యవసాయం బాగుపడదు

- రైతు ఏడిస్తే.. తెలంగాణ ఎలా బాగుపడుతుంది?
- కాంగ్రెస్ పాలనపై మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ధ్వజం



**వేల్పూర్, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణలో వ్యవసాయ రంగం తీవ్రంగా దెబ్బతిన్నదని మాజీ మంత్రి, బాల్కొండ మాజీ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1,000 రోజుల పాలన వైఫల్యాలపై వేల్పూర్ ఎక్స్‌రోడ్ వద్ద నిర్వహించిన రైతు సదస్సులో ఆయన మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం అందించిన 24 గంటల ఉచిత విద్యుత్, ఎస్సారెస్పీ పునర్జీవ పథకం, కాళేశ్వరం ప్రాజెక్టులను రాజకీయ కక్షతో పక్కన పెట్టారని విమర్శించారు. బాల్కొండ నియోజకవర్గంలోని చెక్‌డ్యాంలను ధ్వంసం చేయడం, పలు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను పట్టించుకోకపోవడం సరికాదన్నారు. యూరియా కోసం రైతులను యాప్‌లు, మీ-సేవా కేంద్రాల చుట్టూ తిప్పకుండా నేరుగా సొసైటీలు, ఎరువుల దుకాణాల ద్వారా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా, రుణమాఫీ, ధాన్యం బోనస్ హామీలను పూర్తిగా అమలు చేయాలని కోరారు. నాలుగు ఎకరాల రైతు కుటుంబానికి ప్రభుత్వం రూ.6 లక్షల వరకు బకాయి పడిందని ఆరోపించారు. రైతు సమస్యలపై బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ప్రశాంత్‌రెడ్డి హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యుడు కే.ఆర్. సురేష్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన వెయ్యి రోజుల సంబరాలు




**ఆదిలాబాద్, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
కాంగ్రెస్ ప్రజా పాలన 1,000 రోజులు పూర్తయిన సందర్భంగా ఆదిలాబాద్ రూరల్ మండలం తంతోలి గ్రామంలో సంబరాలు నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, మాజీ చైర్మన్ అల్లూరి సంజీవ్‌రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం రైతులు, మహిళలు, యువత, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. సన్నబియ్యం పంపిణీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ వంటి పథకాలతో ప్రజలకు అండగా నిలుస్తోందని తెలిపారు. ప్రభుత్వ అభివృద్ధిని చూసి ఓర్వలేక బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వెంకట్ యాదవ్, మాజీ జేపీటీసీ కొండా గంగాధర్, అభిషేక్ రెడ్డి, డీసీసీ ఉపా అధ్యక్షులు సుధాకర్ గౌడ్, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పుండ్ర నర్సింగ్, తంతోలి గ్రామ నాయకులు వీరయ్య,రాజేశ్వర్, దండు మధుకర్, సత్మరం, రాములు, రవి, వినోద్ రెడ్డి, పోచారెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణపై అఖిలపక్ష సమావేశం

**- నోటీసులు అందిన ప్రతి ఓటరు విచారణకు హాజరుకావాలి: ఆర్డీఓ**



**ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఎల్లారెడ్డి ఆర్డీఓ కార్యాలయంలో ఓటర్ల జాబితా సవరణపై అఖిలపక్ష నేతలు, సర్పంచులు, రెవెన్యూ, ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 'నో మ్యాపింగ్--అనామలీస్' కేటగిరీలో ఉన్న ఓటర్లకు జారీ చేసిన నోటీసుల పురోగతిని ఆర్డీఓ వివరించారు. నియోజకవర్గంలోని 283 పోలింగ్ కేంద్రాల పరిధిలో 56,460 నోటీసులు జారీ చేయగా, 28,414 (50.33 శాతం) పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇంకా 28,046 నోటీసులు పెండింగ్‌లో ఉన్నాయని, 4,086 మందికి విచారణ పూర్తికాగా, 7,856 మందికి విచారణ గడువు ముగిసిందన్నారు. నోటీసులు అందిన ప్రతి ఓటరు విచారణ రోజున స్వయంగా లేదా కుటుంబ సభ్యుల ద్వారా హాజరై పూర్తి సమాచారం అందించాలని సూచించారు. హాజరుకాని వారి వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా రాజకీయ పార్టీలు, సర్పంచులు గ్రామాల్లో అవగాహన కల్పించి సహకరించాలని కోరారు.

## విజిబుల్ పోలీసింగ్.. బలమైన పోలీసింగ్ వ్యవస్థ అమలు చేయాలి

**- డీజీపీ సూచనలను సిబ్బందికి వివరించిన ఎస్పీ అఖిల్ మహాజన్**



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
జిల్లాలో విజిబుల్ పోలీసింగ్‌తో పాటు బలమైన పోలీసింగ్ వ్యవస్థను అమలు చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్ష నిర్వహించారు. కేసుల దర్యాప్తు, ఆర్థిక, సైబర్ నేరాల పరిశోధనలో మెరుగైన పనితీరు కనబరిచిన సిబ్బందిని అభినందించారు. కేసుల దర్యాప్తు, చార్జిషీట్ల ప్రక్రియను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని, సైబర్, వ్యవస్థీకృత నేరాల నియంత్రణకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. లోక్ అదాలత్ ద్వారా రాజీకి అవకాశం ఉన్న కేసులను పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. గణపతి ఉత్సవాలపై ప్రత్యేక సూచనలు: గణపతి నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎస్పీ సూచించారు. ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. గణపతి మండపాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు పీస్ కమిటీ సమావేశాలు నిర్వహించాలని, మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్, ఫైర్ సిబ్బంది చేరుకునేలా మార్గాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ పరిపాలన పి. మౌనిక , ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే , డీఎస్పీలు ఎల్. జీవన్ రెడ్డి, ఎం. వెంకట నర్సయ్య, సీఐలు, ఎస్సైలు, డీసీఆర్‌బీ, కమ్యూనికేషన్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ రంగ ఆధునీకరణతోనే రైతన్నకు మేలు

### జిల్లా స్థాయి కిసాన్ మేళాలో ఎంపీ గోడం నగేష్

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఆధునిక సాగు పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు చేరువ చేసి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు సమష్టి కృషి అవసరమని ఎంపీ గోడం నగేష్ అన్నారు. మావల మండల కేంద్రంలోని చిలుకూరి లక్ష్మీ గార్డెన్‌లో ఆత్మ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి కిసాన్ మేళాను కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. రైతుల ఆదాయం పెంచేందుకు పంటల వైవిధ్యీకరణ, ఆధునిక సాంకేతికత, శాస్త్రవేత్తల సూచనలను పాటించాలని ఎంపీ సూచించారు. ఆయిల్‌పామ్‌తో పాటు ప్రాంతీయ పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని, ఎగుమతి అవకాశాలను పెంచాలని తెలిపారు. కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. జిల్లాలో సేంద్రీయ వ్యవసాయం, ఆయిల్‌పామ్ సాగు, డ్రోన్ సాంకేతికతను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. గిరిజన యువతకు డ్రోన్ ఆపరేషన్‌పై శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ రైతులకు ఉచిత పంటల బీమా, పొలాలకు రహదారులు, గ్రామాల్లో గోదాముల నిర్మాణం చేపట్టాలని కోరారు. అనంతరం కిసాన్ మేళాలో ఏర్పాటు చేసిన వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక శాఖల స్టాళ్లను, ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాల ప్రదర్శనను ఎంపీ, కలెక్టర్, ఎమ్మెల్యే సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ బోథ్, ఇచ్చోడ ఆత్మ చైర్మన్లు సంతోష్ రావు, రాజు, నారాయణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రవీందర్ సింగ్, పశు సంవర్ధక శాఖ అధికారి రామారావు, ఉద్యాన శాఖ అధికారి సందీప్ కుమార్, ఆర్డీఓ రాథోడ్ రవీందర్, వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.







## అలరించిన పల్లె జానపదాలు

**మందమర్రి సెప్టెంబర్ 03 (తెలంగాణ వాణి)**
దూరదర్శన్ యాదగిరి టీవీ ఛానల్ ఆధ్వర్యంలో మండలంలోని శాంకరి గార్డెన్ లో గురువారం నిర్వహించి న ఆట పాట సీజన్ 4 పల్లె జానపదాల ఆడిషన్స్‌లో గాయకులు ఆలపించిన పల్లె జానపద గీతాలు అలరించాయి. ఈ అడిషన్‌లొ మంచిర్యాల జిల్లాకు చెందిన గాయని, గాయకులు దాదాపు 30 మంది పాల్గొన్నారు. పల్లె మట్టి వాసనల నుంచి పుట్టిన జానపదాలను వెలికి తీసేందు కు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న కళాకారులను ప్రోత్సహించేందుకు డిడి యాదగిరి ఛానల్ ద్వారా ఆటపాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సెలెక్ట్ కమిటీ సభ్యులు ఉప్పులేటి నరేష్, గడ్డం రమేష్ లు తెలిపారు. దీనిలో భాగంగా సీజన్ 4 ఆడిషన్స్ ను జిల్లా కళాకారుల కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిం చినట్లు తెలిపారు. పల్లె పదాలను ప్రపంచానికి పరిచయం చేయాలని సంకల్పంతో కళాకారులు ఉన్న ప్రాంతంలోనే ఆడిషన్స్ నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతగా సీనియర్ కళాకారిణి బండ శాంకరి వ్యవహరించగా యాంకర్‌గా నాగలక్ష్మి వ్యవహరించారు.

## బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

### జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 03 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**
బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎయిడ్ ఎన్జీఓ ఆధ్వర్యంలో బాల్య వివాహ ముక్త భారత్ కు సంబంధించిన వాల్ పోస్టర్లను జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆవిష్కరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... ఆడపిల్లల రక్షణ, సంరక్షణ కోసం జేజేబీ కోర్టు, చైల్డ్ లైన్, ఐసీపీఎస్, ఎయిడ్ ఎన్జీవో పని చేస్తున్నాయని తెలిపారు. ఆపదలో ఉన్న వారు డయల్ 1098, 100 నంబర్లకు కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కే.మిల్కా, డిఆర్డిఏపిడి రాథోడ్ రవీందర్, జిల్లా పంచాయతీ అధికారి గుడిపెల్లి రమేష్, పంచాయతీరాజ్ డిఈ శివరాం, ఐసిడిఎస్ సిడిపిఓ ఎం.ఉమాదేవి, సూపర్వైజర్లు, వివిధ శాఖ కు చెందిన అధికారులు, ఎయిడ్ స్వచ్ఛంద ఎన్జీవో జిల్లా కోఆర్డినేటర్ కే. వినోద్, కమ్యూనిటీ మొబిలైజర్లు సంపత్ కిరణ్, కే. శంకర్ లు ఉన్నారు.

## దోచుకోవడం.. దాచుకోవడమే కాంగ్రెస్ ధ్యేయం

### -- మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు



**లక్షెట్టిపేట, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి):**
కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ పాలనకు నిరసనగా బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఐబీ చౌరస్తా నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దివాకర్‌రావు మాట్లాడుతూ.. రైతులు, నిరుద్యోగులు, కార్మికులు, మహిళలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు న్యాయం జరగకపోతే మరిన్ని ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం వంటావార్పు నిర్వహించి ప్రభుత్వ విధానాలపై నిరసన తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు విజిత్‌రావు, మాజీ మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, మాజీ డీసీసీఎంఎస్ చైర్మన్ కేతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు చుంచు చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌ఐఆర్ సమస్యలపై సబ్ కలెక్టర్‌కు విట్టల్‌రెడ్డి వినతి



**నిర్మల్ - బైంసా: సెప్టెంబర్ 03 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ఎస్‌ఐఆర్ ప్రక్రియలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించాలని కోరుతూ ముధోల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే జి.విట్టల్‌రెడ్డి బైంసా సబ్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. వయోవృద్ధులు బీఎల్‌ఓల వద్దకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నందున వారి ఇళ్లకే బీఎల్‌ఓలను పంపించాలని కోరారు. చిన్న అక్షర దోషాలకు దరఖాస్తులు తిరస్కరించకుండా చూడాలని ధ్రువపత్రాలు లేని వారికి తహసీల్దార్ ధ్రువీకరణ ఆధారంగా అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. నిర్ణీత తేదీల్లో నమోదు చేసుకోలేని వారికి అదనపు అవకాశం ఇవ్వాలని కోరారు.
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## సంకల్ప్ ప్రాజెక్టు కింద రిమ్స్ చిన్న పిల్లల విభాగం ఎంపిక: కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 03 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**
కేంద్ర ప్రభుత్వం ద్వారా అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలవుతున్న సంకల్ప్' ప్రాజెక్టు కింద ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆసుపత్రి చిన్న పిల్లల విభాగం ఎంపిక కావడం శుభపరిణామమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఐ ఐ ఎహ్ ఎఫ్ డబ్ల్యూ.ఛైర్పర్సన్ డా. కవిత రెడ్డి సీలం తో కలిసి వైద్య శాఖ అధికారులతో సంకల్ప్ ప్రాజెక్ట్, రిమ్స్ లో వైద్య సేవలు, ఇతర అంశాలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రిమ్స్ ఆసుపత్రిలోని చిన్న పిల్లల విభాగంలో అందుతున్న వైద్య సేవలు, అక్కడ అందుబాటులో ఉన్న వసతులు, మౌలిక సౌకర్యాలు మరింత మెరుగుపడనున్నాయని అన్నారు. మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు జిల్లా యంత్రాంగం అవసరమైన సహకారం అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ డా.రాథోడ్ జైసింగ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.సాధన, ఇతర వైద్య బృందం, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## క్రాప్ సర్వేలో పంటల వివరాలు నమోదు చేసుకోవాలి

**-- జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా**



**నిర్మల్, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి):**
రైతులందరూ తమ సాగు, పంటల వివరాలను క్రాప్ సర్వేలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. సారంగాపూర్ మండలం గోపాల్‌పేట్ గ్రామ శివారులో కొనసాగుతున్న క్రాప్ సర్వేను గురువారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతుల సమక్షంలోనే పొలాలను పరిశీలించి వాస్తవ పంటల వివరాలను నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. పంటల వివరాలు సక్రమంగా నమోదైతే ధాన్యం విక్రయాలు, ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ ప్రయోజనాలు పొందడంలో ఇబ్బందులు ఉండవని తెలిపారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సర్వేను పారదర్శకంగా, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సుజాత, ఎంపీఓ అజీజ్ ఖాన్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## అంగన్వాడీల్లో చిన్నారులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించాలి

**-- జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా**



**నిర్మల్, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అన్ని మౌలిక వసతులు కల్పించి ఆహ్లాదకర వాతావరణం ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. నిర్మల్ గ్రామీణ మండలం రత్నాపూర్ కాండ్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలోని రికార్డులను పరిశీలించి గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలను ఆకట్టుకునేలా బొమ్మలు, పెయింటింగ్స్, విద్యా చార్టులతో కేంద్రాలను అలంకరించి ఆటపాటల ద్వారా విద్యాబోధన అందించాలని సూచించారు. చిన్నారులకు ప్రతిరోజూ పౌష్టికాహారం అందించడంతో పాటు వారి ఎత్తు, బరువు, ఆరోగ్య వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. సామ్, మామ్ కేటగిరీ పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించి అదనపు పౌష్టికాహారం అందించాలని తెలిపారు. అనంతరం చిన్నారులతో ముచ్చటించిన కలెక్టర్ వారి చదువు, ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, క్రమం తప్పకుండా అంగన్వాడీకి రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి వినూత్న, వైద్యారోగ్య శాఖ అధికారులు పవన్ కుమార్, సౌమ్య, నయనా రెడ్డి, రమేష్, అలీ, సర్పంచ్ హరీష్, ఉప సర్పంచ్ భూమేష్, అంగన్వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

## సంత రోజు.. భారీ వాహనాల జోరు

### అంబేద్కర్ సెంటర్‌లో ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయాలి

**భూపాలపల్లి, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
భూపాలపల్లిలో ప్రతి గురువారం జరిగే అంగడి సంత సమయంలో భారీ వాహనాల రాకపోకలను నియంత్రించి ప్రత్యామ్నాయ మార్గాలకు మళ్లించాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు జిల్లా ఎస్పీని కలిసి వినతిపత్రం అందజేశారు. సంతకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివస్తుండగా, సమీప ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులకు బొగ్గు రవాణా చేసే భారీ లారీలు అదే మార్గంలో తిరగడంతో



ప్రమాదకర పరిస్థితులు నెలకొంటున్నాయని తెలిపారు. సంత ప్రాంతంలో ప్రత్యేక ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేసి వాహనాలను నియంత్రించాలని కోరారు. అలాగే పట్టణంలోని ప్రధాన కూడలైన అంబేద్కర్ సెంటర్‌లో ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ భూపాలపల్లి జిల్లా ఉపాధ్యక్షుడు ఇనుగాల ప్రణయ్, పార్టీ అధికార ప్రతినిధి సంతోష్, రంజిత్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ వెయ్యి రోజుల నయవంచన పాలనను ఎండగడతాం

**-- మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల**

**నిజామాబాద్, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి అన్ని వర్గాలను ఇబ్బందులకు గురిచేస్తోందని నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల ఆరోపించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు గురువారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 22ఏ నిషేధిత జాబితాలో ప్రైవేట్ భూములు చేరడంతో రైతులు, భూ యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అధికారుల తప్పిదాలకు ప్రజలను బాధ్యులను చేసి కార్యాలయాల చుట్టూ తిప్పడం సరికాదని, 22ఏ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతు బంధు, రైతు బీమా, ఉచిత విద్యుత్, వ్యవసాయ యంత్రాల పంపిణీ వంటి పథకాలతో రైతులకు అండగా నిలిచామని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వం రైతు భరోసా, రైతు బీమా, ఉచిత విద్యుత్ అమలులో నిర్లక్ష్యం చేస్తోందని



విమర్శించారు. 22ఏ జాబితాలో భూముల చేర్పుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ప్రజల తరఫున పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ దండు నీతూ కిరణ్ శేఖర్, నగర అధ్యక్షులు సిర్ప రాజు, మాజీ నూడ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, సత్య ప్రకాష్, సుజిత్ సింగ్, నవీద్ ఇక్బాల్, అబ్దుల్ మతీన్, జగత్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**నిర్మల్ - భైంసా: సెప్టెంబర్ 03 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని భైంసా పట్టణంలోని హిందూ వాహిని మహిషా శాఖ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ తూమొల్ల దత్తాత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్న చైర్మన్ కబడ్డీ పోటీలను ప్రారంభించారు.పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఉత్తమ క్రీడాకారులకు నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు,నిర్వాహకులు తదితరులు



పాల్గొన్నారు.



## విజ్ఞాన లోకంలో.. దివ్యాంగ విద్యార్థుల సందడి

**తిమ్మాపూర్, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
కరీంనగర్ జిల్లా దివ్యాంగ విద్యార్థుల కోసం నిర్వహించిన ఎక్స్‌పోజర్ టూర్‌లో భాగంగా హైదరాబాద్‌లోని బిర్లా ప్లానిటోరియం, ఎన్‌టీఆర్ గార్డెన్స్‌ను విద్యార్థులు సందర్శించారు. తిమ్మాపూర్ మండలం నుంచి ఏడుగురు దివ్యాంగ విద్యార్థులు ఈ పర్యటనలో పాల్గొన్నట్లు మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ తెలిపారు. ఇలాంటి పర్యటనలు విద్యార్థుల్లో విజ్ఞానం, ఆత్మవిశ్వాసం, సామాజిక అవగాహనను పెంపొందిస్తాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్‌పీ రాపర్తి గణేష్, స్పెషల్ ఎడ్యుకేటర్లు సుజాత, రమేశ్వర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## మండల కాంగ్రెస్ అధ్యక్షునిగా రూప్లా నాయక్

**ధర్మారం, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి):**



ధర్మారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా తాజా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లౌడ్యా రూప్లా నాయక్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ తెలిపారు. ఇప్పటివరకు మండల అధ్యక్షుడిగా పనిచేసిన గాగిరెడ్డి తిరుపతిరెడ్డిని జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా నియమించిన నేపథ్యంలో రూప్లా నాయక్‌కు బాధ్యతలు అప్పగించారు. నూతన అధ్యక్షుడి నియామకంపై కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## ఆల్ఫోర్స్ జీనియస్ పాఠశాలలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



**హుజూరాబాద్, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి):**
హుజురాబాద్ పట్టణంలోని ఆల్ఫోర్స్ జీనియస్ పాఠశాలలో గురువారం ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించడంతో పాటు ఉట్టి వేడుకలు, నృత్యరూపకాలు, కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి. నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీకృష్ణుడి జీవితం నుంచి ధైర్యం, ధర్మం వైపు నిలిచి అధర్మాన్ని ఎదుర్కొనే స్ఫూర్తిని విద్యార్థులు నేర్చుకోవాలని సూచించారు. భగవద్గీత ద్వారా మానవాళికి శ్రీకృష్ణుడు అందించిన సందేశం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రామంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

### దోమల నివారణకు చర్యలు చేపట్టిన సర్పంచ్ అనూష, లాల్‌కుమార్



**నారాయణఖేడ్, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
కంగ్టి మండలం ముర్కుంజల్ గ్రామంలో దోమల నివారణకు ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టినట్లు సర్పంచ్ అనూష, లాల్‌కుమార్ తెలిపారు. వర్షపు నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి శుభ్రం చేయడంతో పాటు అవసరమైన చోట దోమల మందు పిచికారీ చేసినట్లు పేర్కొన్నారు. మురుగు కాలువలు, పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా, చెత్తాచెదారం పేరుకుపోకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. సీజనల్ వ్యాధుల నివారణకు పారిశుద్ధ్య కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ విజయ్‌రావు పాటిల్, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## సాయిని మల్లేశానికి ఘన సన్మానం



**కరీంనగర్ టౌన్ , సెప్టెంబరు 3, ( తెలంగాణ వాణి ప్రతినిధి )**
కరీంనగర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా నియమితులైన సాయిని మల్లేశం గురువారం తొలిసారిగా కరీంనగర్ కోర్టుకు రావడంతో బీజేపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ఆత్మీయ స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. కరీంనగర్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చంద్రపాటి కిరణ్ కుమార్ శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.సీనియర్ న్యాయవాది, హుస్నాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్న మల్లేశానికి సహచర, సీనియర్ న్యాయవాదులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు గౌతమ్ రెడ్డి, కూర శ్రీనివాస్ రెడ్డి, బీవీ రమణ, గుజ్జ సతీష్, లీగల్ సెల్ న్యాయవాదులు కటకం శ్రవణ్ కుమార్, కొలిపాక చంద్రమౌళి, సుగుర్తి జగదీశ్వరాచారి, వెన్న ఆనంద్, ముద్దసాని సంపత్, ఉషకోయిల రమేష్, గుంజెటి శివ, ముత్తునూరి హరీష్ రావ్, బండారి గాయత్రి, దీరజ్, సాయి చరణ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## సీఈఐఆర్ పోర్టల్‌తో పోగొట్టుకున్న ఫోన్ రికవరీ

### బాధితురాలికి ఫోన్ అప్పగించిన ఎస్సై శ్రీకాంత్




**ధర్మారం, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి):**
లక్షెట్టిపేట మండలం గుల్లకోట గ్రామానికి చెందిన సాగే ప్రేమలత మే 2026లో ధర్మారం నుంచి ఆటోలో ప్రయాణిస్తుండగా మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నారు. దీనిపై ఆమె సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేశారు.పోర్టల్ ద్వారా ఫోన్‌ను గుర్తించిన ధర్మారం పోలీసులు దాన్ని స్వాధీనం చేసుకుని గురువారం ఎస్సై ఈ. శ్రీకాంత్ చేతుల మీదుగా బాధితురాలికి అప్పగించారు. ఫోన్‌ను తిరిగి అందించిన పోలీసులకు ప్రేమలత కృతజ్ఞతలు తెలిపారు.



## కాంగ్రెస్ 1000 రోజుల ప్రజాపాలన సంబరాలు

### కేక్ కట్ చేసి విజయ ర్యాలీ నిర్వహించిన డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి

**హసన్‌పర్తి, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల ప్రజాపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా హనుమకొండ జిల్లా ఎర్రగట్టుగుట్ట జంక్షన్‌లో గురువారం కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి, అనంతరం కాంగ్రెస్ జెండాలతో భారీ విజయ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమం, రైతుల అభ్యున్నతి, నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఎన్నికల హామీలను దశలవారీగా అమలు చేస్తూ ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 66, 65,1వ డివిజన్ అధ్యక్షులు గొర్రె కిరణ్, చిర్రా రాము గౌడ్, నేదునూరి సునీల్, మండల అధ్యక్షుడు అశోక్, పోరెడ్డి మహేందర్ రెడ్డి, మార్క రాజు, సందరాజు సంతోష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రీన్ గ్రోవ్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



**చౌటుప్పల్, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి)**
: చౌటుప్పల్ పట్టణంలోని గ్రీన్ గ్రోవ్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో గురువారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధాదేవి, గోపికల వేషధారణలో అలరించడంతో పాటు బాల్యలీలలు, రాధాకృష్ణుల వేషధారణ, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ వీణ అనిల్‌రెడ్డి మాట్లాడుతూ చిన్నారులకు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల ప్రాముఖ్యతను తెలియజేయడం అవసరమన్నారు. ఇటువంటి కార్యక్రమాలు పిల్లల్లో సృజనాత్మకతను పెంపొందించడంతో పాటు సంప్రదాయాలపై అవగాహన కల్పిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ లక్ష్మి, ఏఓ మురళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కాలువకు గండి.. వృథాగా పోతున్న సాగర్ నీరు

### అధికారుల స్పందనతో గండికి మరమ్మతులు



**చిలుకూరు, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి):**
చిలుకూరు మండల కేంద్రంలోని ముత్యాల బ్రాంచ్ పెద్ద కాల్వ పరిధిలోని పిల్ల కాలువకు గండి పడటంతో సాగర్ నీరు వృథాగా పోయింది. దీంతో దిగువ ప్రాంతాలకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న ఇరిగేషన్ శాఖ అధికారులు వెంటనే స్పందించి కాలువకు పడిన గండిని పూడ్చి మరమ్మతులు చేపట్టారు. దీంతో సాగునీరు దిగువకు సక్రమంగా వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. గండిని సకాలంలో పూడ్చిన అధికారులను రైతులు అభినందించారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ సర్పంచ్‌కు పరామర్శ



**నిర్మల్ - నర్సాపూర్: సెప్టెంబర్ 03 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
నిర్మల్ జిల్లా నర్సాపూర్ మండలం బామ్ని గ్రామ మాజీ సర్పంచ్ దత్తూరాం ఇటీవల అనారోగ్యానికి గురైన విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర కార్య వర్గ సభ్యుడు ప్రజా ట్రస్ట్ చైర్మన్ భోస్లే మోహన్‌రావు పాటిల్ గ్రామానికి చేరుకుని ఆయనను పరామర్శించారు.ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో సాధారణ జీవితం కొనసాగించాలని ఆకాంక్షిస్తూ మనోధైర్యం కల్పించారు.
ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సుభాష్ జాదవ్‌తో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

## లింగాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ప్రీ-ప్రైమరీ తరగతులు ప్రారంభం

### ప్రారంభించిన కార్పొరేటర్ నిమ్మరాజుల రజిని, ఎంఈఓ సంగీత



**పెద్దపల్లి, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
రామగుండం మండలం లింగాపూర్ గ్రామంలోని యూపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రీ-ప్రైమరీ తరగతి గదిని కార్పొరేటర్ నిమ్మరాజుల రజిని, ఎంఈఓ సంగీత ప్రారంభించారు. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులకు వయస్సుకు అనుగుణంగా విద్యాబోధన అందించనున్నారు. తరగతి గదిలో ఆట వస్తువులు, అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేయడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలకు బదులుగా ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని నిమ్మరాజుల రజిని, రవి కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, మంచి అలవాట్లు పెంపొందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ వేముల లావణ్యతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు

## భూభారతి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
జిల్లాలో పెండింగ్‌లో ఉన్న భూభారతి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో దరఖాస్తుల పరిష్కారంపై సమీక్ష నిర్వహించారు. మండలాల వారీగా పెండింగ్ దరఖాస్తుల ప్రగతిని పరిశీలించిన కలెక్టర్.. ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకోవాలని సూచించారు. తిరస్కరించే దరఖాస్తులకు స్పష్టమైన కారణాలను రికార్డుల్లో నమోదు చేయాలని, 22ఏ నిషేధిత జాబితా భూముల సమస్యలను నిబంధనల మేరకు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. దరఖాస్తుదారులకు పారదర్శకంగా సేవలు అందించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీవో దేవీదాస్, సంబంధిత శాఖల అధికారులు, తహసీల్దార్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## హదారులపై రాస్తారోకోలు చేస్తే కఠిన చర్యలు

### ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్‌రెడ్డి హెచ్చరిక

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి ప్రతినిధి)**



జాతీయ, రాష్ట్ర రహదారులపై అనుమతులు లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు నిర్వహించి ప్రజా రవాణాకు అంతరాయం కలిగిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్‌రెడ్డి హెచ్చరించారు. రహదారులను దిగ్బంధించడం వల్ల ప్రజలతో పాటు అంబులెన్స్‌లు, ఫైర్ సర్వీసుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో సమస్యలను పరిష్కరించుకునేందుకు చట్టబద్ధమైన మార్గాలను అనుసరించాలని సూచించారు. జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందున నిబంధనలు ఉల్లంఘించి రహదారులపై ఆందోళనలు నిర్వహిస్తే సంబంధిత చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## కృష్ణవేణిలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

### -- గోపికల వేషధారణతో అలరించిన విద్యార్థులు




**పెద్దపల్లి, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
కృష్ణవేణి స్కూల్స్ గోదావరిఖని, ఎన్టీపీసీ శాఖల్లో గురువారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో అలరించడంతో పాటు బాల్యలీలలు, నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఉట్టి కొట్టే కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భక్తిగీతాలు, చిన్నారుల కేరింతలతో పాఠశాల ప్రాంగణాలు సందడిగా మారాయి. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, శ్రీకృష్ణుడి జీవితం ద్వారా ధర్మం, సత్యం, కర్తవ్యనిష్ఠ వంటి విలువలను విద్యార్థులకు తెలియజేయడమే వేడుకల ఉద్దేశమని యాజమాన్యం తెలిపింది. కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, కరస్పాండెంట్ మంజుల శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ

**నాగిరెడ్డిపేట, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి ప్రతినిధి):**



నాగిరెడ్డిపేట మండలం జలాల్‌పూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. ఎంఈఓ వెంకట్రామిరెడ్డి ఆదేశాల మేరకు సర్పంచ్ నిజాంపేట శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ సాయిబాబా, కాంగ్రెస్ మైనార్టీ మండల అధ్యక్షులు కుతుబుద్దిన్, ప్రధానోపాధ్యాయులు సిరిమల్లె రాజు, ఐకెపిసిసి రాజు, వివోఏ మల్లేశం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## భూపాలపల్లిని రాష్ట్రంలో నంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతాం

**ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు**

**చిట్యాల, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో రైతులు, విద్య, వైద్యం, మహిళా సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చిందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. వెయ్యి రోజుల ప్రజాపాలన పూర్తయిన సందర్భంగా చిట్యాల మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దబ్బెట అనిల్ ఆధ్వర్యంలో గురువారం సంబరాలు నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై బాణసంచా కాల్చి కార్యకర్తలతో కలిసి సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రుణమాఫీ, రైతు భరోసా, సన్నవడ్లకు బోనస్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు వంటి సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. భూపాలపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే నంబర్‌వన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి, పింగిలి జ్యోతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ



జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి కిష్టయ్య, నాయకులు చిలుకల రాయకోమురు, గూట్ల తిరుపతి, పులి తిరుపతిరెడ్డి, ఓరం సమ్మయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అల్లకొండ కుమార్, టౌన్ అధ్యక్షులు గంగాధర రవీందర్ సర్పంచులు కొడారి అశోక్,గుంటుపల్లి నాగమల్లేశ్వరరావు, కొడారి ఓదెలు,కర్రు లక్ష్మీ ప్రతాప్ రెడ్డి,మంటరాం మనోహర్,లావుడ్య రవీందర్ నాయక్ కాసం మాధవి రాజిరెడ్డి కార్యకర్తలు, మహిళలు, యువకులు, ప్రజలు పాల్గొన్నారు..

## మూగబోయిన ప్రజా గొంతుక

**-- మాజీ జెడ్పీటీసీ, జెడ్పీ ఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్ మృతి**

**చిగురుమామిడి, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి విలేకరి):**
చిగురుమామిడి మండల కేంద్రానికి చెందిన మాజీ జెడ్పీటీసీ, జెడ్పీ ఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్ అనారోగ్యంతో బుధవారం రాత్రి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, గ్రామస్తులు విషాదంలో మునిగిపోయారు. తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న రవీందర్ చిగురుమామిడి గ్రామ సర్పంచ్‌గా రెండుసార్లు, జెడ్పీటీసీగా పనిచేస్తూ ప్రజలకు సేవలందించారు. ఆయన కుమార్తెలు అంత్యక్రియలు నిర్వహించగా పలువురు భావోద్వేగానికి గురయ్యారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామ్మోహన్, ఎస్సై జగదీశ్వర్, బిజెపి జిల్లా నాయకులు పొన్నం శ్రీనివాస్,దాసరి ప్రవీణ్ ,సైదాపూర్ మండలం గొల్లగూడెం మాజీ ఎంపిటిసి మిట్టపల్లి కిష్టయ్య, సర్పంచులు అల్వాల శంకర్, బోయిని రమేష్, మాజీ సర్పంచులు జక్కుల రవీందర్, వంగర మల్లేశం,ముల్కనూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు పూదరి వేణు గౌడ్, బొడ్డు నాగేశ్వర్ రావ్, ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బోయిని



శంకర్, జర్నలిస్టులు జీడి నగేష్, పత్తమ్ రమేశ్ ,వివిధ పార్టీల నాయకులు, అధికారులు, మహిళలు, కుటుంబ సభ్యులు, బంధువులు ,గ్రామస్తులు, ఘన నివాళులు అర్పించారు.

## గీతంలో వైభవంగా ఓనం వేడుకలు

**పటాన్ చెరు, సెప్టెంబర్ 3, (తెలంగాణ వాణి):**
రంగులు, సంస్కృతి, స్నేహభావంతో కేరళం సాంస్కృతిక వారసత్వాన్ని చాటాయి హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వ విద్యాలయంలో గురువారం కేరళం గొప్ప సాంస్కృతిక వారసత్వమైన ఓనం పండుగను ఉత్సాహభరితంగా, ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. రంగులు, సంస్కృతి, స్నేహభావంతో నిర్వహించే ఈ ఉత్సవాలు గీతం విద్యార్థులు, అధ్యాపకులను ఒక చోట చేర్చాయి. కేరళ సాంప్రదాయ పంటల పండుగ అయిన ఓనం, మలయాళీ మాసమైన చింగంలో జరుపు కుంటారు. ఇది ఆగస్టు-సెప్టెంబరు నెలల్లో వస్తుంది. పది రోజుల పాటు జరిగే ఈ పండుగ, పౌరాణిక రాజు మహాబలిని స్మరించుకుంటూ, కృతజ్ఞత, శ్రేయస్సు, ఐక్యత, సోదరభావ స్ఫూర్తిని చాటుతుంది. ఈ పండుగ కేరళం కు ప్రకృతితో ఉన్న గాఢమైన అనుబంధాన్ని, దాని సంగీతం, నృత్యం, క్రీడలు, సామూహిక వేడుకల యొక్క గొప్ప సంప్రదాయాలను కూడా ప్రతిబింబిస్తుంది. గీతం హైదరాబాదు ప్రాంగణంలో రంగురంగుల పూలు, సాంప్రదాయ సంగీతం, ఉత్సాహభరితమైన సాంస్కృతిక ప్రదర్శనలతో కళకళలాడింది. విద్యార్థులు సాంప్రదాయ నృత్యాలు, వివిధ రకాల పండుగ కార్యక్రమాల ద్వారా కేరళ సంప్రదాయాల వైభవాన్ని ప్రదర్శించారు. ఈ వేడుకలు కేరళం యొక్క రుచికరమైన వంటకాలతో పాటు, విశిష్ట పాకశాస్త్ర వారసత్వాన్ని చాటి చెప్పే అద్భుతమైన ఓనం సద్య విద్యార్థులను



లొట్టలేయించింది. పండుగ వాతావరణానికి మరింత శోభను చేకూరుస్తూ, కేరళ సాంప్రదాయ 'చెండ మేళం'తో ఈ కార్యక్రమం ఉత్సాహభరితంగా ముగిసింది. ఇది ప్రాంగణాన్ని లయ, వైభవంతో నింపింది. ఈ వేడుక విద్యార్థులను, అధ్యాపకులను ఆనందం, ఐక్యత, సాంస్కృతిక వినిమయం అనే స్ఫూర్తితో ఒకచోట చేర్చింది. ఈ ఉత్సవాలు భారత దేశపు విభిన్న సాంస్కృతిక సంప్రదాయాలను గౌరవిస్తూనే, ఐక్యతను, బలమైన సామాజిక భావవను పెంపొందించాలనే గీతం నిబద్ధతను ప్రతిబింబించాయి. గీతం హైదరాబాదులో జరిగిన ఈ ఉత్సాహభరితమైన ఓనం వేడుకలు, సాంస్కృతిక వైవిధ్యాన్ని కలిసి జరుపుకున్నప్పుడు అది ఐక్యతా బంధాలను, అనుబంధాన్ని బలపరుస్తుందనే విషయాన్ని చక్కగా గుర్తు చేశాయి.

## అంతర్గాం మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా సింగం కిరణ్‌కుమార్ గౌడ్

**-- పదేళ్ల పార్టీ సేవకు దక్కిన గుర్తింపు**

**పెద్దపల్లి, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా పెద్దంపేటకు చెందిన సింగం కిరణ్‌కుమార్ గౌడ్ నియమితులయ్యారు. గత పదేళ్లుగా పార్టీలో చురుగ్గా పనిచేస్తూ, గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేసిన ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ నియామక పత్రాన్ని అందజేసి కిరణ్‌కుమార్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీని మండలంలో మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. ఆయన నియామకంపై కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి.



## శివ్వంపేటలో అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ఆవుల రాజిరెడ్డి

**నర్సాపూర్, సెప్టెంబర్03 (తెలంగాణ వాణి)**
నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి శివ్వంపేట మండలంలో గురువారం పలు అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. చిన్న గొట్టిముక్కల గ్రామంలో శ్రీ నల్లపోచమ్మ మాత విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. అనంతరం గోమారం గ్రామంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. గ్రామాల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని రాజిరెడ్డి తెలిపారు. అదేవిధంగా శివ్వంపేట మండలానికి చెందిన 12 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన రూ. 3.85 లక్షల విలువైన చెక్కులను ఆవుల రాజిరెడ్డి అందజేశారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ పథకం ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వానికి, ఆవుల రాజిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమాల్లో స్థానిక కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## తాండూరులో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**నాగిరెడ్డిపేట మండలం సెప్టెంబర్ 3:( తెలంగాణ వాణి ప్రతినిధి)**
తాండూరు గ్రామపంచాయతీ పరిధిలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. గ్రామ ప్రజలకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించేందుకు కృషి చేస్తున్నామని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భూమ యాదగౌడ్, ఉప సర్పంచ్ అభిషేక్, మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ దివిటి కిష్టయ్య, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భామనీండ్ల సంగయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త మునేగేపల్లి సంగయ్య, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, జీపీఓ, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## సీఎం సభ ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యేలు

### పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచన



**నకిరేకల్, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి):**
ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నకిరేకల్ నియోజకవర్గ పర్యటన నేపథ్యంలో పట్టణంలోని మినీ స్టేడియంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభ ఏర్పాట్లను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం, తుంగతుర్తి ఎమ్మెల్యే సామేలు బుధవారం పరిశీలించారు. సభా వేదిక, తాగునీరు, పార్కింగ్, విద్యుత్, భద్రత తదితర ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. భారీగా ప్రజలు, కార్యకర్తలు తరలిరానున్నందున ఎలాంటి ఇబ్బందులు లేకుండా శాఖలన్నీ సమన్వయంతో పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

## చిలుకూరులో మహిళ అనుమానస్పద మృతి

**చిలుకూరు సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి )**



చిలుకూరు లో మహిళ అనుమాస్పద మృతి చెందింది. గ్రామానికి చెందిన మంద భాగ్య లక్ష్మి (35) ఇంట్లో ఉరివేసుకొని మృతి చెందినది. బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. ఉదయాన్నే కుటుంభ సభ్యులు, చూసి, చుట్టుపక్కల వారికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి విషయాన్నీ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై మోహన్ బాబు ఘటనా స్థలికి చేరుకొని ఆరా తీశారు. మృతదేహాన్ని శవ పంచానామా నిమిత్తం కోదాడ ప్రభుత్వ వైద్యాశాలకు తరలించారు. అప్పల రంగయ్య, ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ సమరభేరి

### ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం విఫలమైంది: మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్




**టేక్మాల్, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి):**
కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం టేక్మాల్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రాంతికిరణ్ మాట్లాడుతూ హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భక్తుల వీరప్ప, సిద్దయ్య, మైనార్టీ నాయకుడు సలీమ్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు నాయికోటి భాస్కర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఒక్క పోటుతో అంతా కూల్చేశారు

కాంగ్రెస్ అధిష్ఠానం కొండా సురేఖతో పాటు చిన్నారెడ్డిపై కూడా చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. తాజాగా తనను తెలంగాణ ప్లానింగ్ కమిషన్ వైస్ ఛైర్మన్ పదవి నుంచి తొలగించడంపై జిల్లెల చిన్నారెడ్డి స్పందించారు. పదవిపై తనకెప్పుడూ ఆశలేదని.. పదవి పోయిందని ఎక్కువగా బాధపడాల్సిన అవసరం కూడా తనకు లేదన్నారు. పదవి లేకపోయినా తనకు దక్కాల్సి గౌరవం దక్కుతుందని స్పష్టం చేశారు. ఈ విషయంపై సీఎం రేవంత్ రెడ్డిని కలవలేదని, కలవాలన్న ప్రయత్నం కూడా చేయలేదని వివరించారు.

## ఇంద్రేశం పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు



**పటాన్ చెరు, సెప్టెంబర్ 3, (తెలంగాణ వాణి):**
శ్రీ కృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని ఉల్లాసంగా ఉత్సాహంగా పిల్లల కేరింతల మధ్య ఉట్టి కొట్టి పండుగ ఘనంగా జరుపు కున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏనుగు శ్రీనివాస్ రావు మాట్లాడుతూ శ్రీ కృష్ణుడు చెరసాలలో పుట్టి ఎన్నో కష్ట నష్టాలు భరించి చివరికి భగవద్గీత బోధించి జగద్గురువుగా మారిన విషయాలను వివరించి పిల్లలు కష్టపడితే ఏదైనా సాధించ వచ్చని సూచించారు. ఈ వేడుకలలో విద్యార్థులు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు సాయిలు, శారద, రేవతి లక్మణ్ రావు, సునీత, ఎల్లారెడ్డి, మౌనిక, లాస్య, జ్యోతి, ఉత్సాహంగా పాల్గొన్నారు.

## రచ్చపల్లిలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు

### ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య: సర్పంచ్ సూర రజిత




**ధర్మారం, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి):**
ధర్మారం మండలం రచ్చపల్లి గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో గురువారం విద్యార్థులకు యూనిఫాం, షూలను సర్పంచ్ సూర రజిత పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాం, షూలను ఉచితంగా అందిస్తోందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి నాణ్యమైన విద్యను అందించాలని కోరారు. అనంతరం పాఠశాలలో ముందస్తు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. ఉట్టి కొట్టే కార్యక్రమంలో చిన్నారులు, తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బైరి సురేష్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ పెరక రమ, ప్రధానోపాధ్యాయులు వంశీ మోహనాచార్యులు, ఉపాధ్యాయులు సంపత్, లక్ష్మణ్, సౌమ్య తదితరులు పాల్గొన్నారు

## నూతన దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం

### ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



**పటాన్‌చెరు, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి):**
పటాన్‌చెరు నియోజకవర్గంలో నూతన దేవాలయాల నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని దువ్వగుంట గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ పోచమ్మతల్లి ఆలయంలో గురువారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. పోచమ్మతల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. బిఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సుష్మా గణేష్, వైస్ చైర్మన్ మహేందర్ గౌడ్, అమీన్పూర్ మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్, సురేందర్ గౌడ్, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతు రాజ్యానికి కేసీఆర్‌నే శరణ్యం

### రాయికల్ రైతు సదస్సులో బీఆర్ఎస్ నేతల పిలుపు



**రాయికల్, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి):**
రాష్ట్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బీఆర్ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాయికల్‌లో గురువారం భారీ ర్యాలీ, రైతు సదస్సు నిర్వహించారు. గాంధీ విగ్రహం నుంచి మార్కెట్ వరకు ర్యాలీ చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. ధాన్యం కొనుగోళ్లలో తరుగు కోతలు, విద్యుత్ కోతలు, ఎరువుల సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ధర్మకాంటా, ట్రాక్‌షీట్ వ్యత్యాసాలపై విచారణ జరిపి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ రైతుబంధు, రైతుబీమా పథకాలను ప్రభుత్వం నీరుగార్చిందని, రైతు భరోసా, రుణమాఫీ హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## "ఆఫీసుల్లో కూర్చుంటే కుదరదు.. పల్లెల్లోకి వెళ్లాలి!"

### అధికారులకు ఎమ్మెల్యే సంజీవరెడ్డి వార్నింగ్..

### నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు

**సంగారెడ్డి జిల్లా, కంగ్టి, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
అధికారుల పనితీరుపై నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు.కంగ్టి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి హాజరయ్యారు. సర్పంచులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. గ్రామాల్లో నెలకొన్న తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, విద్యుత్ తదితర సమస్యలను సభ్యులు సమావేశంలో ప్రస్తావించారు. సమస్యలపై అధికారులు స్పందించే తీరుపై ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. "ప్రజా పాలన అంటే పల్లె పాలన. పల్లె బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది" అన్నారు. గ్రామాల్లో ఇప్పటికీ తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ సమస్యలు ఉండటం



బాధాకరమన్నారు. పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి, గృహజ్యోతి, చేయూత, రైతు భరోసా తదితర సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్హులకు ప్రభుత్వ పథకాలు అందకపోతే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

సర్వసభ్య సమావేశం కేవలం మొక్కుబడిగా నిర్వహించే కార్యక్రమం కాదని, ప్రజా సమస్యలకు పరిష్కారం చూపే వేదికగా ఉండాలని ఎమ్మెల్యే అన్నారు. ప్రతి అధికారి గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. "క్షేత్రస్థాయికి వెళ్లకుండా కార్యాలయంలో కూర్చుంటే కుదరదు" అని స్పష్టం చేశారు. మండలంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి శాఖకు సంబంధించిన ప్రగతి నివేదికలను సక్రమంగా సమర్పించాలని సూచించారు. ప్రజల సొమ్ము వృథా కాకుండా ప్రతి రూపాయి గ్రామాల అభివృద్ధికి ఖర్చు కావాలని అన్నారు.

#### అర్హులకు డిజిటల్ స్మార్ట్ కార్డుల పంపిణీ

సర్వసభ్య సమావేశం అనంతరం ఎమ్మెల్యే సంజీవరెడ్డి అర్హులైన లబ్ధిదారులకు డిజిటల్ స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. దళారీ వ్యవస్థకు చెక్ పెట్టి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను అర్హులకు నేరుగా అందించడమే డిజిటల్ స్మార్ట్ కార్డుల లక్ష్యమని తెలిపారు. ఒక్క స్మార్ట్ కార్డు ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన లబ్ధిదారులకు సులభంగా అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. స్మార్ట్ కార్డులు అందుకున్న లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యార్థుల సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ నిరంతర పోరాటం

### జీవో 97ను వెంటనే రద్దు చేయాలి: ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

**పటాన్‌చెరు, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి):**
కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో విద్యార్థులు, యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తీవ్ర అన్యాయం చేస్తోందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి విమర్శించారు. విద్యార్థులు, యువత సమస్యలు పరిష్కరించే వరకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరంతర పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ 420 హామీలపై బీఆర్ఎస్ చేపట్టిన పోరుబాటలో భాగంగా గురువారం పటాన్‌చెరు డివిజన్‌లోని మైత్రి మైదానంలో విద్యార్థులతో కలిసి భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ కళాశాలల విద్యార్థులు పెద్ద




సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా కార్డు, కాలేజీ విద్యార్థినులకు ఉచిత స్కూటీలు, నిరుద్యోగ యువతకు నెలకు రూ.4 వేల భృతి, తొలి ఏడాదిలోనే 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ వంటి హామీలను ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. ముఖ్యంగా జీవో 97తో పాలిటెక్నిక్ విద్యార్థులకు అన్యాయం జరుగుతోందని, దానిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడకుండా పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మహిపాల్‌రెడ్డి కోరారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు మెట్టు కుమార్ యాదవ్, మాదిరి పృథ్వి రాజ్, విజయ్ కుమార్, విద్యార్థి, యువజన నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య యువత సేవా కార్యక్రమాల్లో ముందుండాలి

### తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు శిరుప అనిల్

**కొమురవెల్లి, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఆర్యవైశ్య యువత సేవా కార్యక్రమాల్లో ముందుండి సమాజ అభివృద్ధికి కృషి చేయాలని తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు శిరుప అనిల్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంప శ్రీనివాస్ పిలుపునిచ్చారు. కొమురవెల్లిలోని శ్రీ వాసవి నిత్యాన్నదాన సత్రంలో గురువారం రాష్ట్ర, జిల్లా ఆర్యవైశ్య మహాసభ యువజన విభాగం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలు, నిరుద్యోగులు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలవడంతో పాటు యువతను సేవా కార్యక్రమాల వైపు నడిపించడమే లక్ష్యమన్నారు. విద్య, ఉపాధి, వ్యాపారం, వైద్యం



తదితర రంగాల్లో యువతను ప్రోత్సహించేందుకు మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. పూర్వీకులు చూపిన సేవా మార్గాన్ని నేటి యువత మరింత ముందుకు తీసుకెళ్లాలని కోరారు. అనంతరం రాష్ట్ర, జిల్లా స్థాయిలో వివిధ బాధ్యతలు చేపట్టిన ఆర్యవైశ్య నాయకులు, ప్రతినిధులను ఘనంగా సన్మానించారు. తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి ఉప్పల చంద్రశేఖర్, రాష్ట్ర కోశాధికారి సోమిశెట్టి పవన్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ గౌరిశెట్టి శ్రీధర్, అదనపు ప్రధాన కార్యదర్శి మైలారపు రాంబాబు, మహాసభ జిల్లా అధ్యక్షులు తణుకు ఆంజనేయులు, జిల్లా యూత్ కోశాధికారి చిట్టా నాగరాజు, జిల్లా యూత్ అదనపు ప్రధాన కార్యదర్శి తేరాల మారుతి, జిల్లా యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ అరవపల్లి హరి కిరణ్ సిద్దిపేట జిల్లా జనరల్ సెక్రెటరీ సముద్రాల హరినాథ్, కోశాధికారి మాంకాల నవీన్ కుమార్, మండల యూత్ అధ్యక్షులు అంబడిపల్లి ఈశ్వర్, మరియు సిద్దిపేట జిల్లా కార్యవర్గ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ యువజన విభాగం సభ్యులు పాల్గొనడం జరిగింది.

## 'తెలంగాణ కాపలా కుక్క' ఏమైంది?

### కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితం: మహాదేవుని శ్రీనివాస్

**కొమురవెల్లి, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
తెలంగాణకు కాపలా కుక్కలా ఉంటానని చెప్పిన మాజీ సీఎం కేసీఆర్ వెయ్యి రోజులుగా ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని కొమురవెల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్ విమర్శించారు. జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, సిద్దిపేట జిల్లా డీసీసీ అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షారెడ్డి ఆదేశాల మేరకు గురువారం కొమురవెల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేసీఆర్ విఫలమయ్యారని ఆరోపించారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని, గిరిజనులు, మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని, పేదలకు మూడెకరాల భూమి ఇస్తామని ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని ఆరోపిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేయడం



హాస్యాస్పదమన్నారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేసి బీఆర్ఎస్ నేతలు విలాసవంతమైన జీవితాలు గడిపారని విమర్శించారు. ప్రతిపక్ష నేతగా కేసీఆర్ అసెంబ్లీకి హాజరై ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ తన పదవికి రాజీనామా చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, గ్రామ శాఖ అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్, అనుబంధ సంఘాల నాయకులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



## బీసీఐటీలో ఉచిత కుట్టుమిషన్ శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు

**జమ్మికుంట, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
జమ్మికుంటలోని బీసీఐటీ కార్తికేయ ఐటీఐ కళాశాలలో ఉచిత కుట్టుమిషన్ శిక్షణ పూర్తి చేసిన విద్యార్థినులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఆరు, మూడు నెలల శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా బీసీఐటీ చైర్మన్ లెంకలపెల్లి శరత్‌కుమార్ మాట్లాడుతూ, శిక్షణ పొందిన విద్యార్థినులు స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. సర్టిఫికెట్ల ఆధారంగా వివిధ ప్రభుత్వ రుణాలు, ఉపాధి పథకాలకు అర్హత పొంద వచ్చన్నారు. బీసీఐటీలో ఉచిత కుట్టుమిషన్, బ్యూటిషియన్ కోర్సులకు అడ్మిషన్లు జరుగుతున్నాయని, ఆసక్తి ఉన్న విద్యార్థినులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ప్రాథమిక పాఠశాలకు టీవీ బహుకరణ.



**హుస్నాబాద్ సెప్టెంబర్ 03 (తెలంగాణ వాణి ఆర్ సి)**
కోహెడ మండలం కూరెళ్ల గ్రామం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు జెల్ల శంకర్, కోహెడ (అల్లుడు గజ్జెల రాజమౌళి) ఇరవై వేల విలువగల టీవీ బహుకరించాడు,జెల్ల బాలమల్లు క్యారంబోర్డు బహుకరించాడు..ఈ కార్యక్రమంలో కోహెడ మండల విద్యాధికారి ఆర్.పద్మయ్యమాట్లాడుతూ డిజిటల్ బోధన ద్వారా పిల్లల్లో నైపుణ్యాల సాధన సులభతరం జరుగు తుందని పిల్లలు ఆహ్లాదకరం గా విద్య ను అభ్యసిస్తారని తెలిపారు. పాఠశాల ప్రధానో పాధ్యాయుడుడి. సత్యానంద్ మాట్లాడుతూ కూరెళ్ల పాఠశాలకు టీవీ బహుకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బండారి లక్ష్మి, ఉపసర్పంచ్ తిరుపతి, వార్డు సభ్యులు శ్రీనివాస్, బాబు,సాయికిరణ్,శంకర్ పాఠశాల ఉపాధ్యాయులు జి.రాజమౌళి,బి .శ్రీలత,పి కవిత,బి .సంగీత, సిహెచ్.దివ్య,తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యేను కలిసిన సహకార సంఘ ప్రతినిధులు

### లక్ష్మీపూర్ సహకార సంఘం నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియచేసిన ఎమ్మెల్యే

**జగిత్యాల:సెప్టెంబర్ 03(తెలంగాణ వాణి ప్రతినిధి)**
జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ సహకార సంఘం నూతన కార్యవర్గ సభ్యులు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపి, మొక్కను అందజేసి అభినందించారు.సహకార సంఘం అధ్యక్షులు సంగేపు తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షులు గోస్కుల మహేష్‌తో పాటు నూతన డైరెక్టర్లు ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ నక్కల రవీందర్ రెడ్డి, ఉపసర్పంచ్ సత్తిరెడ్డి, మాజీ సర్పంచ్ చెరుకు జాన్, నాయకులు రాజేశ్వర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, మల్లేశ్, సర్పంచులు మోహన్ రెడ్డి, శేఖర్, మల్లేశ్, బాపురెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



## బీర్ల ఫౌండేషన్ సహకారంతో బియ్యం సాయం

**రాజపేట సెప్టెంబర్ 3 ( తెలంగాణ వాణి విలేఖరి)**

మండలంలోని కుర్రారం గ్రామానికి చెందిన గజం శ్రీనివాస్ అనారోగ్యంతో మరణించాడు. శ్రీనివాస్ కుటుంబానికి ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆదేశాల మేరకు బీర్ల ఫౌండేషన్ చైర్ పర్సన్ బీర్ల అనిత సహకారంతో 50 కేజీల బియ్యాన్ని గురువారం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామ అధ్యక్షులు ఎర్రగుంట సునీల్ ఆధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు ఎర్రగుంట ప్రభాకర్ మేడి స్వరూప శ్రీనివాస్ మాజీ సర్పంచ్ బాల్ద చంద్రయ్య మాజీ ఉప సర్పంచ్ బూత్కూర్ నరసింహారెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు జూకంటి బాలస్వామి ఎర్రగుంట అనిల్ రావుల రాజు మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు నీల నరసయ్య కాంగ్రెస్ పార్టీ గ్రామ ఉపాధ్యక్షులు పెంటపర్తి సంతోష్ రెడ్డి యువజన నాయకులు నంద నరేష్, చిందం సంపత్ చిట్యాల బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**నిర్మల్ - భైంసా: సెప్టెంబర్ 03 (తెలంగాణ వాణి ప్రతినిధి)**

శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని భైంసా పట్టణంలోని హిందూ వాహిని మహిషా శాఖ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ తూమొల్ల దత్తాత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్న చైర్మన్ కబడ్డీ పోటీలను ప్రారంభించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఉత్తమ క్రీడాకారులకు నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు మరమ్మతులు వెంటనే చేపట్టాలి



**టేకులపల్లి, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి)**

టేకులపల్లి--బోడు ప్రధాన రహదారిలోని అందుగులగూడెం--ఆంజనేయపాలెం మధ్య రోడ్డు గుంతలమయంగా మారి వాహనదారులకు ప్రమాదకరంగా మారిందని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు డి.ప్రసాద్, ఏఐకేఎంఎస్ మండల కార్యదర్శి భూక్య హర్ష్య ఆవేదన వ్యక్తం చేశారు. గుంతల కారణంగా ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. రహదారి మరమ్మతులపై సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. అధికారులు వెంటనే స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకులు అనంతోజు చంద్రాచారి, తునికిపాటి ఆనందు, ఉరిమెళ్ల వెంకటాచారి, లింగ, జయరాం తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు విశ్వవిద్యాలయ సాహితీ పురస్కారం అందుకున్న గవర్నర్ సంయుక్త కార్యదర్శి

**శశికిరణ్ కొమాండూర్ రచించిన 'శ్రీమద్రామాయణం'కు ప్రతిష్ఠాత్మక పురస్కారం**




**హైదరాబాద్, సెప్టెంబర్ 3 (తెలంగాణ వాణి ప్రతినిధి):**

ప్రముఖ కవి, తెలంగాణ గవర్నర్ సంయుక్త కార్యదర్శి, సీనియర్ గ్రూప్--1 అధికారి శశికిరణ్ కొమాండూర్ రచించిన పద్య మహాకావ్యం 'శ్రీమద్రా మాయణం' ప్రతిష్ఠాత్మక 2024 సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయ సాహితీ పురస్కారానికి ఎంపికైంది. హైదరాబాద్‌లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం డా. ఎన్.టి.ఆర్. కళాభవన్‌లో గురువారం నిర్వ హించిన పురస్కార ప్రదానోత్సవంలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ డా. నందిని సిధారెడ్డి చేతుల మీదుగా శశికిరణ్ కొమాండూర్ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా వివిధ సాహిత్య ప్రక్రియల్లో విశిష్ట రచనలు చేసిన మరో తొమ్మిది మంది రచయితలకు కూడా సాహితీ పురస్కారాలను ప్రదానం చేశారు. రామాయణ ఇతివృత్తాన్ని పద్య మహాకావ్యంగా మలిచిన లి'శ్రీమద్రామాయణం'లికు ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించడం తెలుగు సాహిత్య రంగంలో విశేష గుర్తింపుగా నిలిచింది. సాహిత్యాభిమానులు, రచయితలు శశికిరణ్ కొమాండూర్‌కు అభినందనలు తెలిపారు.

# రజనీ అభిమానులకు పండగ

## అక్టోబర్ 15న జైలర్-2 విడుదల



సూర్ స్టార్ రజనీకాంత్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా చిత్రం 'జైలర్ 2'. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా 'జైలర్' సాధించిన ఘన విజయం తర్వాత సీక్వెల్‌పై అంచనాలు మరింత పెరిగాయి. అయితే గత కొద్ది రోజులుగా సినిమా విడుదలపై సోషల్ మీడియాలో పలు రకాల వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. 'జైలర్ 2'కు సంబంధించి ఇటీవల చిత్రబృందం నుంచి పెద్దగా ప్రమోషనల్ అప్‌డేట్స్ రావడం లేదు. దీంతో సినిమా అనుకున్న తేదీకి విడుదల కాకపోవచ్చనే ప్రచారం సోషల్ మీడియాలో జోరుగా సాగింది. రిలీజ్ డేట్ మారే అవకాశం ఉందంటూ అభిమానుల్లో కూడా కొంత గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో మేకర్స్ తాజాగా కీలక అప్‌డేట్ ఇచ్చి ఈ ప్రచారానికి చెక్ పెట్టారు. ముందుగా ప్రకటించిన తేదీ ప్రకారమే సినిమా ప్రేక్షకుల ముందుకు రానుందని స్పష్టం చేశారు. 2026 అక్టోబర్ 15న 'జైలర్ 2' ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుందని చిత్రబృందం మరోసారి స్పష్టం చేసింది. ఈ వి షయాన్ని తెలియజేస్తూ కొత్త రిలీజ్ డేట్ పోస్టర్‌ను విడుదల చేశారు. దీంతో సినిమా వాయిదా పడుతుందనే వార్తలకు తెరపడినట్లైంది. రిలీజ్ డేట్‌పై క్లారిటీ రావడంతో రజినీకాంత్ అభిమానుల్లో సందడి మొదలైంది. దసరా సీజన్‌కు దగ్గరగా ఈ సినిమా థియేటర్లలోకి వస్తుండటంతో బాక్సాఫీస్ వద్ద భారీ ఓపెనింగ్‌పై ట్రేడ్ వర్గాల్లోనూ అంచనా మొదలైంది. ఇప్పటికే 'జైలర్ 2' నుంచి విడుదలైన 'అలా బొలేలో' పాటకు మంచి స్పందన వచ్చింది. రజినీకాంత్ మాస్ ఇమేజ్‌కు తగ్గట్టుగా పాటను రూపొందించడంతో అభిమానుల్లో ఉత్సాహం పెరిగింది. ఇక రిలీజ్ డేట్‌ను అధికారికంగా మరోసారి ప్రకటించిన నేపథ్యంలో ఇకపై ప్రమోషన్లను వేగవంతం చేసేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే మరిన్ని పాటలు, టీజర్, ట్రైలర్ వంటి అప్‌డేట్స్‌తో సినిమాపై హైప్‌ను మరింత పెంచే అవకాశం ఉంది. 'జైలర్ 2'లో రజినీకాంత్‌తో పాటు భారీ తారాగణం భాగమవుతోంది. కన్నడ సూపర్‌స్టార్ శివరాజ్‌కుమార్, మలయాళ సూపర్‌స్టార్ మోహన్‌లాల్, విలక్షణ నటుడు ఎస్.జే. సూర్య, బాలీవుడ్ స్టార్ హృతిక్ రోషన్, సీనియర్ నటి రమ్యకృష్ణ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ముఖ్యంగా ఇతర ఇండస్ట్రీలకు చెందిన ప్రముఖ స్టార్లు ఈ ప్రాజెక్టులో భాగం కావడంతో 'జైలర్ 2'పై పాన్ ఇండియా స్థాయిలో ఆసక్తి మరింత పెరిగింది.




# కృష్ణదేవరాయలుగా కిచ్చా సుదీప్

కన్నడ స్టార్ హీరో కిచ్చా సుదీప్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చారు. ఆయన నటిస్తున్న తాజా చారిత్రాత్మక చిత్రం 'దేవరాయ'టైటిల్ పోస్టర్‌తో పాటు ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఈ చిత్రంలో సుదీప్ ప్రసిద్ధ చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయల పాత్రలో కనిపించనున్నారు. 'కన్నడ రాజ్య రామ రమణ.. మూడు రాయరా గండ.. ఆంధ్ర భోజ.. శ్రీకృష్ణదేవరాయ' అనే పవర్‌ఫుల్ బిరుదులతో ఈ సినిమాను అనౌన్స్ చేశారు. ఈ చిత్రంలో సుదీప్ కిచ్చా 'దేవరాయ'గా వెండితెరపై అలరించనున్నారు. ఈ పాన్-ఇండియా మూవీని అత్యంత భారీ బ్జడెట్‌తో తెరకెక్కిస్తుండగా, సినిమాను 2027 డిసెంబర్‌లో థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. సుదీప్ పుట్టినరోజు కానుకగా విడుదలైన ఈ ఫస్ట్ లుక్ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది. ఈ సినిమాను పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నాడు.





## సంకల్ప సాధకుడు పవన్

### తమ్ముడికి అన్న చిరు బర్త్‌డే విషెస్

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవర్ స్టార్ పవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి ఆయనకు సోషల్ మీడియా వేదికగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పవన్ కల్యాణ్‌ను 'సంకల్ప సాధకుడు' అంటూ సంబోధిస్తూ చిరంజీవి రాసిన భావోద్వేగ లేఖ నెట్టింట ప్రస్తుతం వైరల్‌గా మారింది. తమ్ముడు పవన్‌లో చిన్నప్పటి నుంచే నిబద్ధత, ప్రజలకు మంచి చేయాలనే తపన తాను చూస్తున్నానని చిరంజీవి పేర్కొన్నారు. కుటుంబంపై ఎంత ప్రేమ చూపిస్తారో, తనను నమ్మిన ప్రజల పట్ల కూడా పవన్ అంతే వాత్సల్యం చూపుతారని కొనియాడారు. ఏపీ డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గ్రామాల అభివృద్ధి, గిరిజన ప్రాంతాల అభ్యున్నతి, పర్యావరణ పరిరక్షణ కోసం పవన్ అంకితభావంతో పనిచేస్తున్న తీరు తనలో ఎంతో గర్వాన్ని కలిగిస్తోందని చిరు తెలిపారు. పిఠాపురం ప్రజలకు ఒక ప్రజాప్రతినిధిలా కాకుండా కుటుంబ సభ్యుడిగా అండగా నిలుస్తున్నారని ప్రశంసించారు. పవన్ కల్యాణ్ ఆయురారోగ్యాలతో వర్ధిల్లుతూ, ప్రజలందరూ మెచ్చే నాయకుడిగా తన లక్ష్యాలను సాధించాలని శ్రీ ఆంజనేయ స్వామిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొంటూ 'ఇట్లు మీ అన్నయ్య చిరంజీవి' అంటూ ఆప్యాయంగా బర్త్‌డే విషెస్ అందజేశారు.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com